నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | ఫిబ్రవరి 23, 2024 | www.navatelangana.com

సాంప్రదాయం.. నిత్యనూతనం

జుక్కల్‌లో ఇప్పటికీ కొనసాగిస్తున్న పలువురు


పెండ్లి వేడుకలో గుర్రంపై సవారీ

నవతెలంగాణ-జుక్కల్

నేటి ఉరుకుల, పరుగుల జీవనంలో పలు క్రతువులను మమ అని అనిపిస్తున్న తరుణంలో పలువురు మాత్రం నాటి సాంప్రదాయాలను ఇంకా బతికిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దులోని కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో పలువురు తమ సాంప్రదాయాలను ఇంకా కొనసాగిస్తున్నారు. పండగులు, పెండ్లిల్లు ఇతరాత్ర వేడుకల్లో నాటి సాంప్రదాయాల ప్రకారం చేపడుతూ ఔరా అనిపిస్తున్నారు. వివాహలలో పూర్వం ధనవంతులు గుర్రం పైన తోలేవారు. పేదలు నడుచుకుంటు వచ్చేవారు. తరవాత సైకిళ్ల పైన వచ్చేవారు. కొద్దిరోజులకు బైక్, తర్వాత కారు రథాలు అంటూ రోజుకో మార్పు వస్తున్నది. అయితే జుక్కల్ మండలంలోని కౌలాస్ మాజీ సర్పంచ్ గొల్ల హన్మండ్లు తన కూతురి వివాహంలో గుర్రం పైన కూర్చోని బ్యాండ్ భాజాకు అనుగుణంగా గుర్రంతో నృత్యం చేయించారు.

ఎంపీపీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడి ఎన్నికకు షెడ్యూల్ విడుదలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీరస్వామి గురువారం తెలిపారు. ఈ నెల 28న ఎంపీపీ ఎన్నిక చేపట్టనున్నట్లు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. 2019 మే నెలలో ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించగా.. మండలంలోని పది ఎంపీటీసీ స్థానాలల్లో ఎంపీటీసీలను ఎన్నుకున్నారు. రాఘవపల్లి ఎంపీటీసీగా గెలుపొందిన కృష్ణవేణి ఎంపీపీగా ఎన్నికైన రెండు నెలలకే ఆమె మరణించడంతో వైస్ ఎంపీపీగా ఉన్న తాండూర్ ఎంపీటీసీ రాజదాస్ ఎంపీపీగా కొనసాగుతూ వచ్చారు. అయితే ఈనెల 28న మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించాలని పైనుంచి ఆదేశాలు వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీరాస్వామి తెలిపారు. ఈనెల 24న ఎంపీటీసీలు అందరికీ నోటీసులు జారీ చేయనున్నట్లు 28వ తేదీన ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్నికల విధుల పట్ల అవగాహన ఉండాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్


మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికలు సజావుగా నిర్వహించుటకు నియమిస్తున్న వివిధ బృందాలు విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి తమ కర్తవ్యాలను సమర్థ వంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఏంసిసి, ఎంసిఎంసి, సి-విజిల్, సువిధ, కంట్రోల్ రూమ్ కాల్ సెంటర్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికలలో నియమించిన సిబ్బంది విధులు సమర్థవంతగా నిర్వహించారని ప్రశంసిస్తూ, ఈ పార్లమెంటు ఎన్నికలలో మరింత అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి పొరపాట్లకు, ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు తావివ్వకుండా అంకిత భావంతో (8) గంటల షిఫ్ట్ ప్రకారం పనిచేయాలన్నారు. ముఖ్యంగా సి విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందిస్తూ ఆ ప్రాంత ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలకు, పోలీసులకు, ఎంసిసి నోడల్ అధికారికి సమాచారమందించాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ డబ్బు, మద్యం, కానుకల పంపిణీ, అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్న, వాహనాలు తిరుగుతున్నట్లు సమాచారం వచ్చిన వెంటనే క్షేత్ర స్థాయి అధికారులకు సమాచారమందించి అప్రమత్తం చేస్తూ టి.వి. కూడా వాచ్ చేయాలని, తీసుకున్న చర్యలపై ఆన్ లైన్ వివరాలు నమోదు చేయాలన్నారు.

అదేవిధంగా కాల్ సెంటర్ ద్వారా వచ్చే ఫోన్ కాల్స్‌కు ప్రత్యేక రిజిస్టర్ నిర్వహిస్తూ ఏ అంశానికి ఫిర్యాదు చేస్తున్నారు..? సమాచారమడుగుతున్నారో విడివిడిగా రికార్డు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలపై అవగాహన కలిగి ఉండాలని, సి- విజల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ధారిత సమయంలో పరిష్కరించే సమయంలో ముందస్తుగా ఆధారాలు సేకరించాలన్నారు. సీజ్ చేసిన డబ్బు, వస్తువులను ఈ ఎస్ఎంఎస్ యాప్ లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని, సీజ్ చేసే సమయంలో వీడియోగ్రఫీ తప్పనిసరి ఉండాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుండి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని, కోడ్ అమలులోకి వచ్చిన 24, 48, 72 గంటలలో చేసే విధుల పట్ల పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తే ఎన్నికలలో దుర్వినియోగాన్ని అరికట్టవచ్చని అన్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాలలో ముందస్తు అనుమతులు లేకుండా వస్తున్న ప్రకటనలు, పెయిడ్ న్యూస్, కరపత్రాల ముద్రణ పై దృష్టిసారించా లన్నారు. మీడియా అంశాలపై భారత ఎన్నికల కమీషన్ ప్రత్యేకంగా మార్గనిర్దేశాలను రూపొందిన్నాన్నారు. త్వరలో బృందాలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల పర్యవేక్షకులు జ్యోతి,అనిల్ కుమార్, వివిధ బృందాల సిబంది పాల్గొన్నారు.

పరీక్షల కాలం..


సీసీ కెమెరాల నిఘా

29 నుంచి ఇంటర్ పరీక్షలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్ష రాయనున్న 54,855 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు చేపట్టడంలో నిమగ్నమైన అధికారులు
- పేపర్ లీకేజీ, చూచిరాతలు జరగకుండా పకడ్బందీగా ఏర్పాట్లకు ఆదేశాలు జారీ
- నిమిషం నిబంధన అమలు
- సీసీ నిఘా మధ్య పరీక్షలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి

పరీక్షల కాలం ఆసన్నమైంది. ఈ నెల 28వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 35,346 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, కామారెడ్డి జిల్లాలో 19,509 మంది హాజరుకానున్నారు. కాగా వేసవి ఎండలు ముదురుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాల కేటాయింపు పూర్తి కాగా.. వసతులు కల్పించాలని ఆయా కాలేజీలకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. చూచిరాతలు, ప్రశ్నపత్రాల లీకేజీ వంటి సమస్యలు రాకుండా పకడ్బందీగా పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకోవాలంటూ ఉన్నతాధికారులు సమీక్షలు చేపడుతున్నారు. దీంట్లో భాగంగా నిమిషం నిబంధనలు అమలు చేస్తున్నారు. 9 గంటలు తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా.. పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి లేదు.

ఈ నెల 28వ తేదీ బుధవారం నుంచి వచ్చేనెల మార్చి 19 వరకు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 35,346 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో మొదటి సంవత్సరం జనరల్ 14,965 మంది, 2,399 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉండగా, రెండవ సంవత్సరం రెగ్యులర్ జనరల్ విద్యార్థులు 13,986 మంది, ప్రైవేట్ 1,804 మంది. విద్యార్థులు, రెండవ సంవత్సరం ఒకేషనల్ రెగ్యులర్ 1,999 మంది విద్యార్థులు, ప్రైవేట్ 193 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మొదటి సంవత్సరం మొత్తం విద్యార్థులు 17,364 కాగా రెండవ సంవత్సరం విద్యార్థులు 17,982 మంది ఉన్నారని తెలిపారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 57 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేయనున్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 19,509 మంది పరీక్షలు రాయనుండగా.. ఇందుకోసం 37 కేంద్రాలలో ఏర్పాట్లు చేపట్టనున్నారు.

సీసీ కెమెరాల నిఘా

సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరగనున్నాయి. ఎటువంటి మాల్ ప్రాక్టీస్, దుర్వినియోగాలకు అవకాశం ఇవ్వకుండా పరీక్షలు సజావుగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. విద్యార్థులకు నిర్ధారిత సమయంలో ప్రశ్న పత్రాలు, జవాబు పత్రాలు అందించాలని, వాటిపై విద్యార్థులు హాల్ టికెట్ సరిగ్గా వేసేలా ఇన్విజిలేటర్ సంతకం చేసేలా చూడాలని ఇది వరకే ఆదేశాలు జారీ చేశారు. కాగా పరీక్ష కేంద్రంలోకి గంట ముందు నుంచే విద్యార్థులను అనుమతించనున్నారు. ఉదయం 9.00 గంటల తరువాత పరీక్షా కేంద్రానికి అనుమతిలేదు.

పుకార్లను నమ్మొద్దంటూ అధికారుల సూచన

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశామని విద్యార్థులు ఎలాంటి పుకార్లు నమ్మవద్దని అధికారులు సూచిస్తున్నారు. పరీక్ష రాసే సమయంలో ఎలాంటి ఒత్తిళ్లకు లోను కాకుండా.. బాగా చదివి ప్రతి ప్రశ్నకు సమాధనం రాయాలని సూచించారు. హాల్ టికెట్‌ల పంపిణీ విషయంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని ఇది వరకే తెలిపారు. అయితే ఆన్‌లైన్ లో నుంచి సైతం హాల్‌టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరు కావొచ్చు.

చేపల పెంపకం.. లాభదాయకం

- మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలి : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

చేపల పెంపకం (అక్వా కల్చర్) ఎంతో లాభదాయకమని ఆ దిశగా సన్న, చిన్నకారు రైతులను, మహిళా సంఘాలను ప్రోత్సహించవలసినదిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కొర్ర మీను చేపలకు మార్కెట్ లో ఎంతో డిమాండ్ ఉందని, వ్యవసాయ క్షేత్రంలో కొంత స్థలంలో ట్యాంక్, పాంపడ్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా అటు వ్యవసాయంతో పాటు ఇటు కొర్రమీను చేపల పెంపకం చేపట్టి ఏడాదిలో మూడు సార్లు ఆదాయాన్ని సంపాదించుకోవచ్చని అన్నారు. వీటి నిర్మాణానికి నాబార్డ్ 5 లక్షల రూపాయల ఖర్చవుతుందని అంచనా వేసిందని, పరిశ్రమల శాఖ సహకారంతో పి.ఎం.ఈ.జీ.పి . కింద ట్యాంక్, పాంపడ్ ల నిర్మాణానికి 35 శాతం సబ్సిడీ ఇస్తుందని అన్నారు. ఉదయ్ ఆక్వా కల్చర్ ఏజెన్సీ వీటి నిర్మాణాలు గావించడంతో పాటు అవసరమైన శిక్షణ, సాంకేతిక సలహాలు, సూచనలిస్తుందని కలెక్టర్ తెలిపారు. 8 మాసాలలో చేతికి వచ్చేపంటకు మొదటగా ట్యాంక్‌లో వేయి చేప పిల్లలను విడిచి దాణ పెడుతూ రెండు రోజులకోమారు నీటిని ఖాళీ చేస్తుండాలని, ఇలా నాలుగు మాసాల అనంతరం అట్టి చేప పిల్లలను తిరిగి పాంఫాండ్‌లో వదిలి మరో నాలుగు నెలల తరువాత వాటిని విక్రయిస్తే మంచి లాభాలొస్తాయని అన్నారు. ఇలా ఏడాదిలో మూడు పర్యాయాలు చేప పిల్లల పెంపకం చేపట్టవచ్చని, అట్టి నీటిని వ్యవసాయ క్షేత్రానికి తరలించడం ద్వారా రసాయనిక ఎరువులు వేసే అవసరం కూడా ఉండదని అన్నారు. జిల్లాలో 16,957 మహిళా సంఘాలలో 1,75,670 మంది సభ్యులున్నారని, చేపల పెంపకానికి ముందుకొచ్చిన 656 ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చి 63 యూనిట్లు గ్రౌండ్ చేశామన్నారు. జిల్లాలో వేయి యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని లక్ష్యమని, ఆ దిశగా మహిళా సంఘ సభ్యులను ప్రోత్సహించవలసినదిగా కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో నాబార్డు సహాయ జనరల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, డిపిఎం రమేష్ బాబు, జిల్లా మత్స్య శాఖాధికారి వరదా రెడ్డి, ఆక్వా కల్చర్ సాంకేతిక సలహాదారు , ఎపిఎం లు, సి.సి. లు, మహిళా సమాఖ్య సభ్యులు, మత్స్య సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్ రూ.274 కోట్లు

- ప్రవేశపెట్టిన మేయర్ దండునీతుకిరణ్
- మీడియాకు నో ఎంట్రీ
- ప్రభుత్వం మారినా.. పాలసీ మారలేదు


బడ్జెట్ ప్రవేశ పెడుతున్న మేయర్ దండు నీతు కిరణ్.. హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్

నిజామాబాద్ నగర మున్సిపల్ కార్పోరేషన్ బడ్జెట్ రూ.274 కోట్లుగా ప్రవేశ పెట్టారు. నగరంలోని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మేయర్ దండు నీతూ కిరణ్ అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి ముఖ్యఅతిధిగా ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, నగర ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంత్, డిప్యూటీ మేయర్ ఇద్రీస్ ఖాన్, నగర మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్, కార్పొరేటర్లు కో ఆప్షన్ సభ్యులు అధికారులు పాల్గొన్నారు. బడ్జెట్ సమావేశాన్ని ఉద్దేశించి మేయర్ మాట్లాడుతూ 2024-25సంవత్సరానికి సుమారు 274 కోట్ల అంచ బడ్జెట్ ను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ఈ బడ్జెట్ లో మున్సిపల్ ఆదాయం సుమారు 90 కోట్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి సుమారు 177 కోట్ల నిధులు గ్రాంట్ల ద్వారా వచ్చే అవకాశం ఉందని అన్నారు. మున్సిపల్ ఆదాయం నుండి మౌలిక సదుపాయాల నిర్వహణ చేపట్టనున్నట్లు తెలిపారు.

సమావేశానికి ముందు కార్పొరేటర్లు సమస్య లపై చర్చించాలని కోరగా మేయర్ అనుమతించి సభ్యుల ప్రశ్నలకు అధికారులతో వివరణ ఇచ్చినట్లు సమాచారం. సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే లను నగర మేయర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. నగర అభివృద్ధికి నిధుల సమీకరణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నిజామాబాద్ 60 డివిజనల్ పరిధిలోని కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అయితే సమావేశం ముందు మీడియాను అనుమతించకపోవడంతో కార్పొరేటర్లు ఎట్టి పరిస్థితులలో మీడియాను తప్పనిసరిగా అనుభవిం చాలని పట్టుపట్టారు. అయినప్పటికీ మీడియాను అనుమతించకపోవడంతో పోలీసులను లోపలికి పిలిపించి లోపల ఉన్న మీడియాను బయటకు పంపించారు. దీంతో మీడియా ప్రతినిధులతో పాటు మీడియా సంఘాలు అలాగే కార్పొరేటర్లు సైతం తీవ్రంగా ఖండించారు.

ప్రభుత్వం మారినా.. పాలసీ మారలేదు

ప్రభుత్వం మారినా... మున్సిపల్ పాలసీ మాత్రం మారలేదు. ఒకవైపు ప్రస్తుతమున్న ప్రభుత్వం ప్రజా పాలనా అని తెలియజేస్తున్నప్పటికీ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో మీడియాకు అనుమతించకపోవడం గమనార్హం. గత ప్రభుత్వం పాలసీ ఇప్పటికీ అమలవుతోందని కార్పోరేటర్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపల్ సమావేశంలో ఏం జరుగుతుందో నగర ప్రజలకు తెలియాలని సమావేశానికి మీడియా కు అనుమతించాలని పలువురు కార్పోరేటర్‌లు డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలపై తాము గళం విప్పుతున్నా. ప్రజలకు చేరువ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై తాము ఎన్నిసార్లు సమావేశంలో మాట్లాడాము, ఏ విధంగా ప్రశ్నించాము, ప్రభుత్వం ప్రజల పక్షాన ఏ విధంగా ఉంది అనే అంశాలు మీడియా ద్వారానే ప్రజలకు తెలుస్తుందని కార్పోరేటర్‌లు ఆవేదన వ్యక్తం చేశారు.

ముందుగా సమావేశంలో బడ్జెట్ ప్రవేశపెట్టేముందు మీడియాకు అనుమతిం చాలంటూ బిజెపి, కాంగ్రెస్ కార్పొరేటర్లు మేయర్‌తో వాగ్వాదానికి దిగారు. అయినప్పటికీ మేయర్ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశాలలో మీడియాకు అనుమతి లేదనే జీఓ ఉందని అన్నారు. ఈ సమావేశంలో హాజరైన ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మీడియాకు అనుమతించని జీఓని తొలగించాలంటూ ప్రభుత్వానికి పంపించాలని తెలిపారు. అనంతరం అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ అసెంబ్లీలో, జిహెచ్ఎంసి లోను మీడియాకు అనుమతి ఇస్తున్నప్పటికీ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశాలలో కూడా అనుమతించాలని కోరారు. అదేవిధంగా మున్సిపాలిటీకి కేంద్ర నిధులు పట్టణ ప్రగతి, పలు అభివద్ధి కార్యక్రమాల పైన బడ్జెట్ రావడం జరిగింది అన్నారు.

ఈ సమావేశంలో మీడియాకు అనుమతించా లంటూ బిజెపి ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, కాంగ్రెస్ కార్పొరేటర్ గడుగురోహిత్ చాలాసేపు మేయర్‌ను అనుమతించాలని కోరారు. అయినప్పటికీ మీడియా ను అనుమతించకుండానే సమావేశం కొనసాగించేల మీడియాని పంపించడానికి పోలీసులకు చెప్పి పంపించి వేశారు.


మీడియాకు అనుమతి ఇవ్వాలని పలువురు కార్పోరేటర్‌ల నిరసన.. మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే ధన్‌పాల్ లక్ష్మినారాయణ

జిల్లా కేంద్రంలో కొత్త ధర్నాచౌక్ ఏర్పాటు



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ప్రజలు సంఘాలు / సంస్థలు వాళు నిరసన హక్కును సద్వినియోగం చేసుకోవడం కోసం మరో ప్రాంతంలో ధర్నాచౌక్ ఏర్పాటు చేసినట్టు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో పాత కలెక్టరేట్ ఎదుట ఇదివరకు ధర్నాచౌక్‌లో నిరసనలు చేపట్టేవారని, అయితే ఆ స్థలంలో ధర్నా చేయడం వలన ప్రధాన రహదారి ద్వారా రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, జిల్లా కోర్టు కాంప్లెక్స్ జనరల్ హాస్పటల్‌లకు వెళ్లే వారికి అడ్డంకులు ఇబ్బందులు కలుగుతున్నట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు నిజామాబాద్ రెవెన్యూ డివిజినల్ అధికారి 1000 చదరపు అడుగుల స్థలం గల ప్రదేశాన్ని నిజామాబాద్ అర్బన్ లోని ఆబాదీ ప్రాంతంలోని పాత మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న కేటాయించినట్టు పేర్కొన్నారు. నిజామాబాద్ దక్షిణ మండల సర్వేయర్ ద్వారా హద్దులు పెట్టారని, కావున నిజామాబాద్ రెవెన్యూ డివిజినల్ అధికారి సమర్పించిన నివేదికను పరిశీలించిన తర్వాత ధర్నాచౌక్ కోసం నిజామాబాద్ దక్షిణ మండలం నిజామాబాద్ అర్బన్ లోని ఆబాదీ ప్రాంతంలోని పాత మున్సిపల్ కార్యలయం పక్కన గల 1000 చదరపు గజాల స్థలం వద్ద ధర్నాలు చేసుకోవచ్చని తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎవ్వరయిన నిరసనలు చేయాలనుకునేవారు ముందస్తుగా నిజామాబాద్ ఎ.సి.పి అనుమతి తప్పనిసరిగ్గా తీసుకోవాలని సూచించారు. ముందస్తు అనుమతి తీసుకోకుండా ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా నిరసనలు నిర్వహిస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రకటనలో పేర్కొన్నారు.

'డబుల్' నిధులు గోల్‌మాల్

- కొత్తబాది లబ్దిదారుల ఆందోళన
- కాంట్రాక్టర్‌లకే చెల్లించామంటూ చేతులెత్తేసిన అధికారులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నిరుపేదలకు గూడు కల్పించాలన్న లక్షంతో గత సర్కార్ తీసు కొచ్చిన డబుల్ బెడ్‌రూం పథకం బాన్సువాడ డివిజన్‌లో అబాసు పాలైంది. అవినీతికి, అక్రమాలకు కేరాఫ్‌గా మారిందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బాన్సువాడ మండలం కొత్త బాది గ్రామస్తులు స్వంత డబ్బులతో డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మించుకున్న వారికి బిల్లులు ఇవ్వక పోవడంతో గురువారం బాన్సువాడ డివిజన్ పంచాయతీ రాజ్ కార్యాలయానికి వచ్చి ఆందోళన చేశారు. డబుల్ బెడ్ రూమ్ ల నిర్మాణం కాంట్రాక్టర్‌కు ఇవ్వడం జరిగిందని లబ్ధిదారులకు ఇచ్చే అధికారం తమకు లేదని అధికారులు చేతులు ఎత్తివేయడంతో చేసేది ఏమీ లేక వెను తిరిగారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నేతలు, కాంట్రాక్టర్ల మధ్య దళారులు కలిసి నిబంధనలను తుంగలో తొక్కిపట్టి లక్షల్లో కొల్లగొట్టినట్లు సర్వత్రా ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

బాన్సువాడ నియోజకవర్గం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక కృషితో అతి పేదలను గుర్తించి అవసరం ఉన్న వారందరికీ డబుల్ బెడ్ రూమ్ లను మంజూరు చేశారు. అధికారులు పారదర్శంగా పనిచేయాలని ఇందులో ఎవరు అవినీతి అక్రమాలకు పాల్పలకుండా నాణ్యత ప్రమాణాలతో కూడిన ఇల్లు నిర్మాణం జరిగేలా చూడాలని ఎవరైనా లబ్ధిదారులు సొంత డబ్బులతో నిర్మించుకుంటే వారికి సకాలంలో డబ్బులు చెల్లించాలని పదేపదే మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పలు సందర్భాల్లో సూచించారు. అయినప్పటికీ గ్రామస్థాయి పార్టీ కొందరు నేతలు, కాంట్రాక్టర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ లబ్ధిదారులకు అందవలసిన డబుల్ బెడ్ రూమ్ నిధులను సొంత అవసరాలకు వాడుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

బాన్సువాడ మండలంలోని కొత్త బాది గ్రామంలో 28 లక్షల రూపాయలను అదే గ్రామానికి చెందిన నేత సొంతానికి వాడినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సొంత డబ్బులతో ఇండ్లు నిర్మాణం పూర్తయినప్పటికీ ఇప్పటికీ బిల్లులు ఎందుకు రావడం లేదని గ్రామస్థాయి పార్టీ నేతలకు అధికారులను ప్రశ్నించగా మీ గ్రామానికి రావాల్సిన నిధులు ఎప్పుడో వచ్చాయని, వివరించగా తమ డబ్బులు ఇవ్వాలంటూ అదే గ్రామానికి చెందిన పార్టీ నేతలను ప్రశ్నించగా తమకు కాంట్రాక్టర్ డబ్బులు ఇవ్వలేదని కొన్ని రోజులు దాటేశాడు. అనంతరం గ్రామానికి వచ్చిన అధికారులను ప్రశ్నించగా నిర్మాణం పూర్తి అయిన వారికి డబ్బులు వస్తాయని, ఆ గ్రామానికి చెందిన అదే నేతను ఒత్తిడి చేయడంతో కొందరికి డబ్బులు చెల్లించాడు. మిగతా వారికి త్వరలో మీ అందరికీ డబ్బులు అందేలా కృషి చేస్తానని ఎవరైనా ఒత్తిడి చేస్తే నాకేం తెలియదు అంటూ చేతులు ఎత్తేశాడు. దీనితో దిక్కుతేచని పేదలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక అధికారుల చుట్టూ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగిన ఎవరు పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు

బాన్సువాడ పట్టణంలో పంచాయతీరాజ్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి , కాంట్రాక్టర్, ఓ నాయకుడు చక్రం తిప్పారు. డబుల్ బెడ్ రూంల వ్యవహారంలో చేతి వాటం ప్రదర్శించారు. అందినకాడికి దొబ్బుకునే ప్రయత్నాలు చేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఇల్లు పూర్తయిన లబ్ధిదారునికి ఇవ్వాల్సిన నిధులు వారికి నచ్చిన వారికి బిల్లులు ఇస్తున్నారు. ఎందుకు అలా చేస్తున్నారని ప్రశ్నించగా మళ్లీ వచ్చే బిల్లులో మీకు అడ్జస్ట్ చేస్తామని స్థానిక నాయకుడు హామీ ఇవ్వడంతో చేసేది ఏమీ లేక బిల్లు వస్తుందని ఆశతో ఇన్ని రోజులు ఎదురుచూస్తున్నారు.

బాన్సువాడ నియోజకవర్గం లో గత 30 ఏళ్లుగా పోచారం శ్రీనివాస్ రెడ్డి కార్యకర్తలు క్రమశిక్షణతో ఉండి లబ్దిదారులకు లబ్ధి చేకూర్చే విధంగా నాయకులు ఉండాలని ప్రజలకు సేవలు అందిస్తేనే ప్రజలు తమని నాయకునిగా ఎన్నుకుంటారని ప్రతి సమావేశంలో ఆయన సూచించేవారు. కానీ కొందరు ఆయన మాటలను పెడచెవిన పెట్టి వారికి ఇష్టం వచ్చిన వ్యవహరిస్తున్నారని అదే పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వాళ్ళనే పార్టీకి నష్టం జరుగుతుందని, మాజీ స్పీకర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ ఇలాంటి వారిపై తగు చర్యలు తీసుకొని నష్టపోయిన లబ్దిదారులకు పిల్లలు వచ్చేలా చూడాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నేరుగా కాంట్రాక్టర్‌లకే చెల్లించాం

నాగేశ్వరరావు హౌసింగ్ డిఇ

డబుల్ బెడ్ రూమ్ ల నిర్మాణం, వాటి బిల్లులు కాంట్రాక్టర్‌కు సంబంధమని, నేడు కొత్త బాది గ్రామానికి చెందిన కొందరు కార్యాలయానికి వస్తే వారికి ఇదే విషయం చెప్పానని ఆయన అన్నారు. ఆ గ్రామానికి సంబంధించిన బిల్లులు దాదాపు కాంట్రాక్టర్‌లకు చెల్లించామని లబ్ధిదారులు కాంట్రాక్టర్ వద్దకు వెళ్లి పరిష్కరించుకోవలని బాన్సువాడ పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీర్ నాగేశ్వరరావు తెలిపారు.

ఉద్రిక్తల మధ్య రెండు గ్రామాల వాగులో సరిహద్దు సర్వే


సర్వే చేపడుతున్న అధికారులు

నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)

వేల్పూర్ మండలం లోని జానకంపేట్-పచ్చల నడుకూడ గ్రామాల మధ్య పెద్దవాగులో సరిహద్దుపై నెలకొన్న వివాదాన్ని సద్దుమణిగించేందుకు గురువారం అధికారులు సర్వే నిర్వహించారు. పెద్దవాగులో తమ భూమి కోతకు గురవుతూ కూలుస్తున్నప్పటికీ వాగులో తమకు భాగం లేదని, పచ్చలనడుకుడ గ్రామస్తులు ఇసుక తీయనియడం లేదని జానకపేట గ్రామస్తులు చాలా రోజులుగా అధికారులకు విన్నవిస్తున్నారు. సరిహద్దు చూపడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇటీవల రెండుసార్లు కలెక్టరేట్‌ను ముట్టడించారు. దాంతో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారుల ఆదేశించి సర్వేకు పంపించారు. జిల్లా సర్వే ఏడి సిహెచ్ శ్రీనివాసులు, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్‌లు వెంకటేశ్వర్లు, సర్వేయర్లు సాయిలు, ప్రవీణ్ కుమార్ ఇతర అధికారులు వాగులో సర్వే నిర్వహించారు. జానకపేట్ గ్రామస్తుల కోరిన సర్వే నెంబర్ల ప్రకారం మ్యాపులో చూస్తూ అధికారులు సర్వే నిర్వహించారు. ఉదయం మొదలుకొని సాయంత్రం వరకు సర్వే చేపట్టారు. సర్వే ముగిసిన తర్వాత వివరాలను ఇరు గ్రామాల వారు పిలిపించుకొని మాట్లాడారు. రెండు గ్రాముల మధ్య సరిహద్దు వివాదం చాలా తీవ్రస్థాయిలో ముదరడంతో రెవెన్యూ అధికారులు పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. రెండు గ్రామాల్లో 144 సెక్షన్ విధించారు. ఆర్డీవో రవికుమార్ వేల్పూర్ తహసీల్దార్ సరిత రెవెన్యూ ఇన్స్పెక్టర్ వేణు సర్వేను దగ్గరుండి జరిపించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏసిపి బస్వారెడ్డి, రూరల్ సీఐ శ్రీనాథ్ రెడ్డి, డివిజన్‌లోని వివిధ మండలాల ఎస్సైలు బందోబస్తు నిర్వహించారు.

గల్ఫ్‌లో ఘనపూర్ తండా వాసి మృతి

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని ఘన్పూర్ తాండాకు చెందిన గంగావత్ చందర్ (38) గత 20 రోజుల క్రితం దోహా కత్తర్ దేశానికి లేబర్ వీసా పై, బతుకుదెరువు కోసం వెళ్లాడు. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు మిత్రుల ద్వారా సమాచారం అందడంతో కుటుంబం, బంధుమిత్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ప్రభుత్వం స్పందించి మృదేహాన్ని త్వరగా స్వగ్రామానికి తీసుకురావాలని కోరుతున్నారు.

విజయ్ హైస్కూల్‌లో ట్విన్స్ డే సంబరాలు



నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని మామిడిపల్లి విజయ్ హైస్కూల్లో కవల పిల్లల దినోత్సవాన్ని సంబురంగా నిర్వహించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ టి.కవిత దివాకర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా కవలలుగా ఉన్న విద్యార్థినీ విద్యార్థులను ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ



నవతెలంగాణ-బోధన్
పట్టణంలోని రాకాసిపేట్ 8వ వార్డులో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు మీర్జా లాయఖ్ బేగ్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి ఉర్దూ మీడియం, 5వ తరగతి చదువుతున్న తెలుగు మీడియం విద్యార్థులకు పరీక్ష అట్టలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సలీం, సామాజిక కార్యకర్త సనా పటేల్, కాంగ్రెస్ నాయకులు మక్బుల్ అహ్మద్, ముబీన్ అలీ, షకీల్ అర్షద్, అర్షద్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బాటిల్స్‌లో దగ్గుమందు వాడొద్దు



వినతిపత్రం అందజేత పలువురు నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ప్లాస్టిక్ బాటిల్స్‌లోని దగ్గుమందును వినియోగదారులు వాడవద్దని, వాడకం వలన చిన్నపిల్లల ఆరోగ్యానికి హానికరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి తెలిపారు. గురువారం నిజామాబాద్ వినియోగదారుల మండలి ప్రతినిధులు జిల్లా సమీకృత కార్యాలయంలోని ఔషధ నియంత్రణ పరిపాలన కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అనేక రకాల దగ్గు మందులు ప్లాస్టిక్ బాటిల్స్‌లో ఉండటం వల్ల, సరైన స్టోరేజ్ లేక వేడిమికి కరిగిపోయిన ప్లాస్టిక్ అవశేషాలు దగ్గు మందులో కలిసి పోవడం, దగ్గు మందులు రెండు సంవత్సరాల కాలం వరకు నిల్వ కొరకు ఉత్పత్తి సంస్థలు మందులో ఎక్కువ శాతం డైథిలిన్ గ్లైకాల్ కలపడం వల్ల తీవ్ర హానికరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివరించారు. ఆ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే నిజామాబాద్‌లో చాలా వరకు మెడికల్ షాపుల్లో వినియోగదారులకు అర్థం కాని రీతిలో జనరిక్ మందుల వ్యాపారం జరుగుతున్న విధానాలను ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ వినియోగదారుల మండలి ప్రతినిధులు పెందోట అనిల్‌కుమార్, సందు ప్రవీణ్, వి.యస్.వర్మ, కె.సాయి కుమార్, బానోతు సందీప్, నీరడి అనిత, మహదేవ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

- మండల విద్యాధికారి ఆంధ్రయ్య



మాట్లాడుతున్న విద్యాధికారి ఆంధ్రయ్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శ్రేణి ఫలితాలు సాధించాలని మండల విద్యాధికారి ఆంధ్రయ్య అన్నారు. గురువారం మండలంలోని హాసకొత్తూర్ ఉన్నత పాఠశాలలో పలు తరగతి గదులలో ఏర్పాటు చేసిన ఫ్లాట్ పానల్ కంప్యూటర్ సిస్టంలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యారంగంలో మంచి ఫలితాలు తీసుకురావడానికి ప్రభుత్వం అనేక వసతులు కల్పిస్తున్నదని అందులో భాగంగానే మన ఊరు మనబడి కార్యక్రమంలో అన్ని పాఠశాలల్లోనూ ఫ్లాట్ పానల్‌లను ఏర్పాటు చేస్తుందన్నారు. పదవ తరగతి పరీక్షలు త్వరలో జరగనున్నందున అత్యున్నత ఫలితాలు తీసుకురావడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని, ఇతర అవకాశాల కోసం ఆశపడకుండా సొంతగా పరీక్షలు రాయాలని సూచించారు. మంచి ఫలితాలు తెచ్చి ఉన్నతస్థాయి చదువులు చదివి ఉద్యోగాలు సంపాదించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డిఎల్ఎన్‌చారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికై కృషి చేస్తా



సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్
సమస్యల పరిష్కారానికై నిర్విరామ కృషి చేస్తానని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సుంకం భూషణ్ అన్నారు. బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వేదిక జిల్లా కార్యవర్గం ఎన్నికను రాష్ట్ర అధ్యక్షులు బుస్సాపూర్ శంకర్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించి, వారికి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయంగా ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా వెనక బాటుకు గురైన వర్గాల అభ్యున్నతికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ మేరకు వేదిక జిల్లా అధ్యక్షునిగా మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన సుంకం భూషణ్‌ను నియమించి అభినందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులుగా ఆప్కారి రాజన్న, ఉషమ్ జైరాం, జిల్లా ఉపాధ్యక్షులుగా కారంపూరి రవి కుమార్, రాథోడ్ సుందర్‌సింగ్, గొల్లపల్లి జగన్‌గౌడ్, వడ్లూరి శైలజ, రజక సంఘం సాయిలు, జిల్లా అధికార ప్రతినిధిగా బాలేకార్ మనీష్ తేజ, కార్యదర్శులుగా వై.అనిల్‌కుమార్, చింతకింది సంతోష్, కుంచెపు ఆనంద్, సరిచంద్ మేఘవత్, చిన్నజీ నవీన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించి నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

మార్చ్ 5 నుంచి బీఎడ్ మూడో రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బి.ఎడ్ మూడవ సంవత్సరం రెగ్యులర్ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు మార్చి 5 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు తెలంగాణ వర్సిటీ వెబ్‌సైట్ www.telaganauniversity.inలో పొందుపరిచినట్టు సూచించారు.

ఎస్ఎఫ్ఐ నాయకుడిపై దాడిచేసిన ఏబీవీపీ గుండాలపై చర్యలు తీసుకోవాలి

- జేఎన్టీయూ వీసీని తొలగించాలి
- ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్
జేఎన్టీయూ ఎస్ఎఫ్ఐ నాయకుడు కార్తీక్‌పై దాడిచేసిన ఏబీవీపీ గుండాలపై చర్యలు తీసుకోవాలని జేఎన్టీయూ వీసీని వెంటనే తొలగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం జేఎన్టీయూలో ఎస్ఎఫ్ఐ నాయకుడిపై దాడిచేసిన ఏబీవీపీ గుండాలను డిబార్ చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి పోషమైన మహేష్ మాట్లాడుతూ.. జేఎన్టీయూలో విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తూ జెఎన్టియు వీసీ అక్రమాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ, అడ్డుకుంటూ విద్యార్థుల పక్షాన పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం పనిని ఓర్వలేని ఏబీవీపీ నాయకులు గురువారం మేడ్చల్ జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్‌పై అమానుషంగా దాడి చేసి కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అదేవిధంగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయని వారు, అక్రమాలకు పాల్పడుతున్న వీసీని కాపాడుతున్న ఏబీవీపీ నాయకులు ఏ విధంగా విద్యార్థి సంఘం అవుతారని ప్రశ్నించారు. అలాగే ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం మతం, కులం, ప్రాంతంతో సంబంధం లేకుండా ఎల్‌కెజి నుంచి పీజీ వరకు విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తుందని అన్నారు. అదేవిధంగా చేతనైతే విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేయాలని ఏబీవీపీ నాయకులకు సూచించారు. అదేవిధంగా దాడులు చేసినంత మాత్రాన సమస్యల పరిష్కారం కోసం, తప్పును ప్రశ్నించడం కోసం వెనుకడుగు వెయ్యకుండా మరిన్ని ఉద్యమాలు చేస్తామని, ఈ సందర్భంగా తెలియజేశారు. ఎస్ఎఫ్ఐ నాయకుడిపై దాడిచేసిన ఏబీవీపీ నాయకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు వేణు, గణేష్, సందీప్, ఎస్ఎఫ్ఐ నగర నాయకులు మారుతి, ఆజాద్, కిరణ్, సాయి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కులగణతోనే వర్గీకరణ సాధ్యం

- మాదిగ జేఏసీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి

నవతెలంగాణ-కంఠేశ్వర్
కులగణతోనే ఎస్సీ వర్గీకరణ, అన్ని కులాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ సంఘాల రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. మాదిగల జోడోయాత్రలో భాగంగా గురువారం నిజామాబాద్ నగరంలోని గౌతమ్‌నగర్ చౌరస్తాలో మాదిగల జోడోయాత్ర సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ.. కులగణన చేయకుండా బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని తద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలలో సుదీర్ఘంగా ఉన్న సమస్యలు అలాగే ఉండిపోయాయని, కేవలం కులగణన చేస్తేనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని అన్నారు. ఉత్తర తెలంగాణ ప్రజలు అల్లర్లను మతవిద్వేషాలకు తావునీయకుండా బిజెపి పార్టీని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి తీరాలని ఆయన పిలుపునిచ్చారు. కేవలం మాదిగలకు మాయమాటలు చెప్పి మాదిగల ఓట్ల ద్వారానే ఉత్తర తెలంగాణలో బిజెపి పార్టీ అసెంబ్లీ స్థానాలు గెలుచుకుందని మాదగలకు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కమిటీలతో కాలయాపన చేస్తుందని అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ క్రైస్తవ వ్యతిరేకి పార్టీ కేవలం బిజెపి పార్టీనే అని అన్నారు. మాదిగలు బిజెపి పార్టీకి ఓటు వేస్తే ఈసారి కేంద్రంలో అధికారం కోల్పోతున్న ఆ పార్టీ మాదిగల సమస్యలు చెప్పుకోవడానికి అధికార కాంగ్రెస్ పార్టీతో ఇబ్బందిగా ఉంటుందని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో మాదిగల జోడోయాత్ర విజయవంతం కావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. నేడు పెద్దపల్లి కరీంనగర్‌లో మాదిగల జోడో యాత్ర ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ జిల్లా నాయకులు బరికుంటా శ్రీనివాస్, మాల్యాల గోవర్ధన్, మల్లని శివ, శివకుమార్, విజయ్‌కుమార్, మహేందర్, నేషనల్ దళిత సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు బుదాల బాబురావు, తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డ యాదయ్య, ఎం.హెచ్.పి.ఎస్ అధ్యక్షులు మైసా ఉపేందర్, మహా ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ముత్యపాగం నరసింహారావు, బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బొరెల్లి సురేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ప్రసాద్, మాదిగ యూత్ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నక్క మహేష్, దేవరకొండ నరేష్, గద్దల రమేష్, జోగు గణేష్, మీసాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ డాక్టర్ పిమర్తి రవి

రైతులపై పోలీసులు దాడిని ఖండించండి

నవతెలంగాణ-ఆర్మూర్
రైతులపై హర్యానా పోలీసుల ఫాసిస్టు హంతకదాడిని తీవ్రంగా ఖండించాలని తెలంగాణ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ భూమేశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శి దాస్ తీవ్రంగా ఖండించారు. హర్యానా, పంజాబ్ సరిహద్దుల్లో హర్యానాకు చెందిన పోలీసుల కాల్పులలో పంజాబ్ రాష్ట్రానికి చెందిన బటిండా జిల్లాలోని బాలన్ గ్రామానికి చెందిన 24 సంవత్సరాల యువకుడు శుభకరన్ సింగ్ మరణించాడని, ఇది దుర్మార్గపు దాడి అని విమర్శించారు. గురువారం పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్నదాత- రైతన్న అంటూనే రైతన్నలపై దుర్మార్గంగా కాల్పులు జరిపిన హర్యానా పోలీసులను వెంటనే హత్యా నేరం కింద అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. మోడీ రైతు వ్యతిరేక విధానాల వల్ల అనేక మంది రైతులు అసువులు భాస్తున్నారని వారు తెలిపారు. ఈ కాల్పుల ఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతుల పండించిన పంటకు (ఎంఎస్‌పి) కనీస మద్దతు ధర ఉత్పత్తి వ్యయంపై ఒకటిన్నర రేట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు రుణ విమోచన చట్టం తీసుకురావాలని, విద్యుత్ సవరణ బిల్లు ద్వారా విద్యుత్తు రంగ ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని, రైతు వ్యతిరేక మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవాలని, ఢిల్లీలో నిర్వహించిన చారిత్రాత్మకమైన రైతాంగ పోరాటంలో మరణించిన 750 మంది రైతు కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రైతులపై అమానుషంగా కాల్పులు చేయడం కేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వ కార్పొరేట్ మతతత్వ విధానాలను రుజువు చేస్తుందని వారు తెలిపారు. ఢిల్లీలో రైతాంగ పోరాట సందర్భంగా రాతపూర్వకంగా ఒప్పందం రాసి ఇచ్చిన మోడీ సర్కార్ మాట తప్పుతోందని తెలిపారు. రైతులను నిర్బంధిస్తే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పుతారని మోడీ ప్రభుత్వాన్ని దాసు, భూమేశ్వర్ హెచ్చరించారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.సూర్యశివాజీ, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి ఫ్రీన్స్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఘనంగా సీతారామాంజనేయ, నవగ్రహ ప్రాణప్రతిష్టాపన

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని బాగేపల్లి గ్రామంలో సీతారామాంజనేయ, నవగ్రహ ప్రాణప్రతిష్టాపన గురువారం హంపి పీఠాధిపతి విద్యారణ్య స్వామి కరముల చేత చేపట్టారు. గత మూడు రోజులుగా విగ్రహాలకు వేదమంత్రాలతో పూజలు జరిపి అనంతరం గురువారం విగ్రహ ప్రతిష్టాపన భాజా భజంత్రీల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాముల వారు మాట్లాడుతూ.. సమాజంలో హిందూ ధర్మాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం గ్రామస్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బాలయోగి పిట్ల కృష్ణ స్వామి మహారాజ్, గంగోత్రి శ్రీ రామదాసు దీనబంధు మహారాజ్ కేదరీనాథ్, ఆలయ కమిటీ అధ్యక్షులు సాయగౌడ్, కోశాధికారి గోపాల్, గ్రామపెద్దలు సాయిబాబా గౌడ్, పాముల సాయిలు, సురేందర్‌గౌడ్, గోపి, భాస్కర్, రవీందర్‌గౌడ్, సుభాష గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే..

మండలంలోని బాగేపల్లి గ్రామంలో సీతారామ ఆంజనేయ, నవగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పి.సుదర్శన్‌రెడ్డి హాజరు కాగా ఆయనకు కుంబాభిషేకంతో స్వాగతం పలికారు. ఆలయంలో ఆయన చేత వేద బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన గ్రామంలోని సమస్యల గురించి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయనతోపాటు కాంగ్రెస్ జిల్లా నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్, నాగభూషణం రెడ్డి, సురేందర్‌గౌడ్, ధనుంజయ్, జావీద్ ఉద్దీన్, సాయిరెడ్డి, కాంగ్రెస్ యువజన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చదువుతో పాటు క్రీడలు అవసరమే

- అంబేద్కర్ యూత్ సభ్యులు

నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)
విద్యార్థిని విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని మండలంలోని పడగల్ గ్రామ అంబేద్కర్ యూత్ సభ్యులు అన్నారు. ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు మంచిర్యాల సురేష్ కుమార్‌ను గురువారం సన్మానించారు.
విద్యార్థిని విద్యార్థులకు చిన్ననాటి నుంచి చదువుతో పాటు క్రీడల పోటీలలో ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న వ్యాయామ ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీ సమస్యలు పరిష్కరించాలి

- యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
తెలంగాణ యూనివర్సిటీలోని సెంట్రల్ లైబ్రరీలో కాంపిటేటివ్ బుక్స్, ఎంట్రెన్స్ న్యూ ఎడిషన్ బుక్స్, అదేవిధంగా లైబ్రరీలో ఫ్యాన్లు లేవని, అలాగే మిగిలిన సమస్యలన్నీ పరిష్కరించాలి కోరుతూ గురువారం నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు కొమిర శ్రీశైలం మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో కాంపిటేటివ్ బుక్స్, ఎంట్రెన్స్ న్యూ ఎడిషన్ బుక్స్, అదేవిధంగా లైబ్రరీలో ఫ్యాన్స్ లేవని వెంటనే ఫ్యాన్స్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. లైబ్రరీలో లైట్స్ కూడా సరిగ్గా లేవని వాటన్నింటినీ తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. ఓల్డ్ బాయ్స్ హాస్టల్లో ఉన్న రూముల్లో లైటింగ్ తక్కువగా ఉందని, అందులో కూడా లైట్స్ పెట్టించి సమస్యలను పరిష్కరించే విధంగా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శులు బానోత్ సాగర్ నాయక్, అల్లూర్ రాజేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-సిరికొండ
మండలంలోని న్యావనంది గ్రామంలో మూడు విప్లవ పార్టీల విలీనం జాతీయ మహాసభల పోస్టర్స్‌ను గురువారం ఆవిష్కరించారు. అలాగే గ్రామాలలో పార్టీ శ్రేణులు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తు ప్రచారం నిర్వహించారు. సీపీఐఎంఎస్ మాస్ లైన్ (ప్రజాపంథా) ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్ రమేష్, పార్టీ డివిజన్ నాయకులు దామోదర్, బాబన్న సాయరెడ్డి, మండల నాయకులు రమేష్, పెద్దసాయులు, నవీన్, గంగాదాస్, సర్పంచ్ సాయిలు, ప్రణీత్, న్యావనంది, కారోబార్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వేలం పాట



మాట్లాడుతున్న తహసీల్దార్

నవతెలంగాణ-రెంజల్
మండల కేంద్రంలోని కార్యాలయంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక డంపులను సీజ్ చేయగా.. గురువారం తహసీల్దార్ ఎంఎ ఖలీమ్ వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో తన్వీర్ అనే వ్యక్తి రూ.24,200లకు అక్రమ ఇసుకను దక్కించుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రూ.19,500ల వేలంపాట నిర్వహించగా ఆ వేలంపాటలో ముగ్గురు పాల్గొనగా తన్వీర్ అధిక మొత్తంలో వేలం పాట పాడి దక్కించుకున్నారు. మూడు టిప్పర్ల ఇసుక, రెండు ట్రాక్టర్ల ఇసుకను కలిపి వేలంపాట పాడినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, డ్రయినేజీ పనులు ప్రారంభం

నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)
వేల్పూర్ మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామంలో జెడ్పి నిధులతో సిసి రోడ్డు, డ్రయినేజీ పనులను జెడ్పిటిసి భారతీ రాకేష్ చంద్ర గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి మాట్లాడుతూ.. బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో వేల్పూర్ మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామంలో రూ.1,50,000 సీసీ డ్రైన్ పనులను, లక్ష రూపాయల సీసీ రోడ్డు పనులను మొత్తం రెండు లక్షల అరవై వేల రూపాయలతో పనులను ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గుడాల గంగాధర్, నోముల గంగారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ రాజారెడ్డి, నచ్చన్నగారి గంగారెడ్డి, డాక్టర్ మారుతి, ఏంగంటి రవి, ఎనుగంటి నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యునికి ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రానికి చెందిన పశు వైద్య డాక్టర్, మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు బండి వార్ విజయ్ గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలో చికిత్సలు పొందుతున్నారు. సమాచారం అందుకున్న జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావు బుధవారం రాత్రి నాందేడ్‌కు వెళ్లి ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఎమ్మెల్యే వెంట జుక్కల్ మండల నాయకులు వినోద్, మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్ తదితరులున్నారు.

ఎంపీ నిధులతో బోర్‌మోటార్ ఏర్పాటు



బోర్‌మోటార్ పనులు ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివ నగర్ గ్రామంలో పోస్ట్ ఆఫీస్ దగ్గర ఎంపీ బిబి పటేల్ ఎంపీ నిధులతో బోరు మోటర్ ఏర్పాటు చేసినట్టు నాయకులుతెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వంకాయల రవి ముదిరాజ్, సొసైటీ చైర్మన్ కమలాకర్ రావు, మండల్ కోఆప్షన్ సభ్యులు అల్తాబ్, వార్డ్ మెంబర్స్ పెసరి సాయిలు, వంగిటి సంతోష్ రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పోలీస్ బాల్ రెడ్డి, కొమ్ము సాయిలు, దాకయ్య, రమేష్, పున్నం రాజయ్య, వడ్ల బాలరాజు, నరసయ్య హెచ్ రవి కల్లం సాయిలు శివరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు
పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి/నిజామాబాద్‌సిటీ

ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చీఫ్ సూపెరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణపై గురువారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేస దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధులు కేటాయించిన అధికారులు వెంటనే ఆయా పరీక్షా కంద్రాలను సందర్శించి ఫర్నీచర్, విద్యుత్, మంచినీరు, వెలుతురు వంటి మౌలిక సదుపాయాలును పరిశీలించి ఏమైనా లోటుపాట్లు ఉంటె తెలిపితే తగు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షా కేంద్రాలవద్ద ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలనీ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, పరీక్షల విభాగం అధికారులు, చీఫ్ సూపెరింటెండెంట్లు, శాఖాపర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్...



నిజామాబాద్‌లో మాట్లాడుతున్న డీఐఈవో రఘురాజ్

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

నిజామాబాద్ సిటీ : జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఇంటర్ విద్య అధికారి, పరీక్షల నిర్వహణ కన్వీనర్ రఘురాజ్ అన్నారు. పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపర్డెంట్లు, డిపార్ట్ మెంటల్ ఆఫీసర్ లు కీలకమని అన్నారు. 2024 వార్షిక పరీక్షల నిర్వహణ కోసం గురువారం నిజామాబాద్ ప్రభుత్వ బాలుర(ఖిల్లా) జూనియర్ కళాశాలలో సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారుల శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. పరీక్షల నిర్వహణలో ఏమరుపాటు లేకుండా చాకచక్యంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఇంటర్ విద్య కమిషనర్ అదేశానుసారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు , అడిషనల్ కలెక్టర్ కిరన్ కుమార్ ల ఆధ్వర్యంలో పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని అన్నారు. నియమ నిబంధనల ప్రకారమే ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని అన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్ లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని ఆదేశించారు.

పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైన పరీక్షల నిర్వహణ కమిటీనీ సంప్రదించాలని సూచించారు. పరీక్షల ను సాఫీగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని అన్ని కళాశాలల ప్రిన్సిపాల్ లను, అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్ లను కోరారు. అన్ని పరీక్షా కేంద్రాలలో మంచినీటి వసతి, మూత్రశాలలు, పరీక్ష గదులలో ఫ్యాన్ ల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రశ్నపత్రాలను పోలీస్ స్టేషన్ ల నుండి తీసుకొచ్చిన తర్వాత సీ.సీ. కెమెరాల ముందు మాత్రమే ఓపెన్ చేయాలని ఆదేశించారు. ఉదయం 8:30 గంటల నుండి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని ప్రతి ఒక్కరి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎలాంటి చీటీలు లోనికి రాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. 9 గంటల తర్వాత పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించరాదని ఆదేశించారు.

పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవి కుమార్, రజియుద్ధిన్ అస్లం, దేవారాం లు మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో తాము జిల్లా ఇంటర్ విద్య కార్యాలయంలో అందుబాటులో ఉంటానని ఏ సమస్య అయినా తమ దష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామని అన్నారు. చీఫ్ సూపర్ ఇంటెండెంట్ లు, డిపార్ట్మెంటల్ అధికారులు పరీక్షల కు ముందు చేయాల్సిన ఏర్పాట్లు, పరీక్ష పూర్తి అయిన తరవాత చేయాల్సిన విదుల ను తెలియజేశారు. బాలుర కలశాల ప్రిన్సిపల్ యాకినుద్ధిన్, హై పవర్ కమిటీ డాక్టర్ చిరంజీవి, బల్కు అధికారి చిన్నయ్య ప్రభుత్వ అధ్యాపకుల సంఘాల నాయకులు నర్సయ్య, లక్ష్మినారాయణ, భాస్కర్ పలువురు ప్రిన్సిపాల్ లు మాట్లాడారు.

ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



అన్నదాన కార్యక్రమంలో స్వయంగా వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో గురువారం నాడు చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బండి వార్ విజయ్ ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. ఎంపీ బీబీపాటిల్ సహకారంతో వేడుకల్లో భాగంగా పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యేలు కుమారి అరుణతార, హనుమంతు షిండే స్వయంగా భోజనం వడ్డించారు. మాజీ ఎమ్మెల్యేల సేవలు అభినందనీయమని చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవ కమిటీ ధన్యవాదాలు తెలిపింది. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యేలతో పాటు ఎంపీ బీబీ పాటిల్ కుటుంబ సభ్యులు, దోంగ్లి సింగిల్ విండో చైర్మన్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ రామ్ పటేల్, యువ నాయకులు అక్షయ పటేల్, ఉత్సవ కమిటీ నాయకులు సభ్యులు మద్నూర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ మద్నూర్ తాజా మాజీ సర్పంచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కవల విద్యార్థులకు మెమోంటోలు అందజేత



నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని బ్లూ బెల్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 14 మంది కవల పిల్లలకు గురువారం మెమోంటోలు అందజేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ సంజీవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ కవల పిల్లల దినోత్సవం పురస్కరించుకొని తమ పాఠశాలలో విద్య నభ్యసిస్తున్న 14 మంది కవల విద్యార్థులకు మెమెంటోలు అందజేసి స్వీట్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. దీంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొందని వెల్లడించారు. ఈ కార్య క్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవోగా పనిచేసి డీఎల్‌పీవోగా జీపీ సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఎంపీడీవో గా విధులు నిర్వహించి ప్రమోషన్ ద్వారా డిఎల్పిఓగా ఇతర జిల్లాల్లో పని చేసిన నాగరాజ్ మళ్లీ బాన్సువాడ డీఎల్పిఓగా బదిలీపై ఇటీవల వచ్చారు. గురువారం మద్నూర్ గ్రామపంచాయతీని సందర్శించి పంచాయతీ రికార్డులను పరిశీలించారు. డిఎల్పిఓ నాగరాజుకు మద్నూర్ మండల పరిధిలోని ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ఆయనకు పూర్తిగా అవగాహన ఉందని, డివిజనల్ అధికారిగా మళ్లీ రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మద్నూర్ మండలంలో ప్రతి జీపి పరిధిలో పనులు సక్రమంగా జరగడానికి గ్రామ కార్యదర్శులకు ఆదేశాలు ఇవ్వడం జీపిల్లో రిజిస్టర్ల తనిఖీలు పకడ్బందీగా చేపడుతున్నట్టు సిబ్బంది తెలిపారు.

మార్చి 3న పల్స్ పోలియో

- విజయవంతం చేయాలి : వైద్యాధికారి శివకుమార్

నవతెలంగాణ-పిట్లం

మార్చ్ 3వ తేదీనా నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి శివకుమార్ అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ సమావేశపు హాలులో పల్స్ పోలియోపై హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం 0 నుండి 5 సంవత్సరాల పిల్లలకు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న పల్స్ పోలియో కార్యక్రమము ద్వారా పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలనే దఢ సంకల్పంతో మార్చ్ 3న పోలియో కార్యక్రమం ఆరోగ్య కేంద్రాలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. రెండవ రోజు నుండి 5 వ తారీకు వరకు హౌస్ టూ హౌస్ విజిట్ నిర్వహించాలన్నారు. 100 శాతం పూర్తి చేసి లక్ష్యం చేరుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎస్ అన్వరి బేగం, సూపర్ వైజర్ హెల్త్ అసిస్టెంట్లు, వాలంటీర్లు, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి

పుస్తె మట్టెలు అందజేత



పుస్తే, మట్టెలు అందజేస్తున్న సంఘం సభ్యులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన ముదాం శ్యామల-బాలయ్య కూతురు విజయలక్ష్మి, రెడ్డిపేట్ గ్రామానికి చెందిన శెట్టిపల్లి లక్ష్మి-లింగం కుమార్తె శ్రీజ శ్రీలా పెండ్లిలకు కాచిగూడ మహాసభ వారి సౌజన్యంతో, మండలం మునూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పుస్తె మట్టెలను గురువారం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కడెం శ్రీకాంత్, నాయకులు కాల హనుమాన్లు, చంద్రశేఖర్, స్వామి, మహిపాల్, రాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

'లక్‌పతిదీది'కి పేద మహిళలను గుర్తించాలి

- డీపీఎం రమేష్ బాబు

నవతెలంగాణ-పిట్లం

లక్‌పతి దీది పథకంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో మహిళలను లక్షాధికారులను చేసేందుకు పేద మహిళలను గుర్తించాలని డిపియం రమేష్ బాబు, ఏపిఎం జగదీష్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ శక్తి భవనంలో లక్‌పతి దీదీపై పిట్లం, పెద్ద కొడప్‌గల్ మండలాల వివోఏల శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ గ్రామాలలోని మహిళా సంఘాల సభ్యులలో అత్యంత వెనుకబడిన పేద మహిళలను సర్వే ద్వారా గుర్తించాలని వివో ఏలకు ఆదేశించారు. ఒక్కొక్క వివోఏలు 80 మందికి తగ్గకుండా పేద మహిళలను గుర్తించాలన్నారు. సర్వే సమయంలో ప్రతి మహిళా సభ్యుల ఇంటికి వెళ్లి నేరుగా వారి పూర్తి కుటుంబ సమాచారమును రిజిస్టర్ లలో పొందుపరిచి గుర్తించాలని సూచించారు. ఏ ఒక్క పేద మహిళ తప్పిపోకుండా చూడాల్సిన బాధ్యత వివోఏపై ఉందన్నారు. అర్హులైన పేద మహిళలు తప్పిపోయినట్లయితే వివో ఏలు బాధ్యత వహించవలసి వస్తుందని వారు సూచించారు. కాగా వివో ఏ లకు సర్వే రిజిస్టర్ లను అందజేశారు. అనంతరం గేమ్స్ , సాంగ్స్ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం శిరీష , రెండు మండలాల సీసీలు , వివో ఏలు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారిని

ఆలయ వార్షికోత్సవ వేడుకలు



ఆలయ వార్షికోత్సవం వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని యాచారం తండాలో నిర్మించిన జగదాంబ మాత, సేవాలాల్ ఆలయం 35వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. తండా నాయకుల ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, హెూమం,లక్షపుష్పార్చన, మహామంగళహారతి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం శ్రీ రాజరాజేశ్వర కల్యాణం జరిపి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంగ్య నాయక్, వైస్ చైర్మన్ లాల్సింగ్, కార్యదర్శి పిర్సింగ్ నాయక్, తండా నాయకులు సంతోష్ నాయక్, కిషన్ నాయక్, బలిరామ్ నాయక్, బాభ్య నాయక్, లచ్చిరామ్ నాయక్, ఏమజి నాయక్, అమర్ సింగ్, జైత్రమ్ నాయక్, మోహన్ సింగ్, సంగ్య రమేష్ నాయక్, శ్రీరామ్, సవాయిరాం ఆలయ కమిటీ సభ్యులు, తండా నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి మహిళ మృతి



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణానికి చెందిన మహిళా ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందినట్లు కామారెడ్డి రూరల్ ఎస్సై రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన సుంకం విజయ (48) కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వరం పల్లి, పల్లెవానికుంటలో పడి మృతి చెందింది. కల్లాపి చల్లేందుకు పేడను తీసుకురావడం కోసం వెళ్లింది. అనంతరం గ్రామ శివారులోనీ పల్లె వానికుంట వద్దకు వెళ్లి పేడ అంటిన చేతులు శుభ్రం చేసుకోవడానికి కుంటలోనికి దిగగా కుంటలో జెసిబితో తీసిన గుంతలో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్న వైద్యులు

గురుకులంలో హెల్త్ క్యాంపు

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి (మర్కల్) నందు ప్రిన్సిపల్ డాక్టర్ వి. రాధిక ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సదాశివనగర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి డాక్టర్‌లు అస్మా ఆఫ్రీన్, మారుతీ బాబు , ఇష్మయానత్ థలి, గౌతమి, అయేషా ఏఎన్ఎమ్‌లు వచ్చి విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి హెమోగ్లోబిన్ శాతం పరిశీలించారు. రక్తహీనతకు గల కారణాలు, తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్స్ విద్యార్థులకు వివరించారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల హెల్త్ సూపర్వైజర్ డాక్టర్ హరిణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా భక్కి సంధ్య బాల్ రాజు



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి నియోజకవర్గం రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ బక్కి సంధ్య బాల్ రాజ్ ను బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తున్నట్లు మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పా రెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బక్కి సంధ్య గతంలో రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామనికి మొన్నటి వరకు ఉప సర్పంచ్ గా వ్యవహరించారు. బీజేపీ మహిళా మోర్చా రాజంపేట మండల అధ్యక్షురాలిగా, కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గా పని చేసి ఇప్పుడు నూతనంగా రాష్ట్ర కార్యదర్శి గా భాధ్యత తీసుకోవడం జరిగిందన్నారు.

ఈద్గా నిర్మాణానికి భూమి పూజ



పలనులు ప్రారంభిస్తున దృశ్యం

నవతెలంగాణ-నసురుల్లబాద్

నసురుల్లాబాద్ మండల కేంద్రములోని హైవే పక్కనున్న ఈద్గా నిర్మాణానికి లక్ష రూపాయలు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మంజూరు చేయడంతో గురువారం స్థానిక నేతలు భూమి పూజ చేశారు. మంజూరు చేసిన నిధులతో పనులు వెంటనే నిర్మాణం జరగాలని స్థానిక నేతలు కాంట్రాక్టర్లను సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఫోరం కన్వీనర్ కంది మల్లేష్, నాయకులు ఖలీల్, యూసఫ్, ఫయాజ్, అజ్గార్ అలీ, సత్తార్, పాషా ఫాయాజ్,

రక్తదానంలో ఆదర్శంగా నిలుస్తున్న తండ్రి కొడుకులు

నవతెలంగాణ-కామారెడ్డి

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఏరియా వైద్యశాలలో అత్యవసరంగా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీకి ఏ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో ఐవిఎఫ్ నాయకులు గంగిశెట్టి ప్రవీణ్ కుమారుడు గంగిశెట్టి శ్రవణ్ 24 వ సారి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచినట్టు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు గురువారం తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ గంగిశెట్టి కుటుంబ సభ్యులలో తండ్రి గంగిశెట్టి ప్రవీణ్ 88 సార్లు, పెద్ద కుమారుడు గంగిశెట్టి కిరణ్ 19 సార్లు రక్తదానం చేస్తే, ఈ రోజు చిన్న కుమారుడు గంగిశెట్టి శ్రావణ్ 24వ సారి రక్తదానం చేయడం అభినందనీయమని అన్నారు. కుటుంబ సభ్యులందరూ ఆపదలో ఉన్న వారి ప్రణాలను కాపాడడం కోసం రక్తదానానికి ముందుకు రావడం నేటి సమాజంలో ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తుందని రక్త దానం చేసిన రక్తదాతకు ఐవిఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా తరపున అభినందనలు తెలియజేశారు.



రక్తదానం చేస్తున్న శ్రావణ్

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

- జిజి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేధన్ గుజరాతి



నవతెలంగాణ-ఆర్మూర్

శాంతి భద్రతల పరిరక్షణకు నూతన ఏసిపిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన బాస్వరెడ్డి కృషి చేయాలని జిజి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేధన్ గుజరాతి అన్నారు. పట్టణ ఏసిపి కార్యాలయంలో గురువారం రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు డి.జే.దయానంద్, మంచిర్యాల కిషన్ పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నివేధన్ మాట్లాడుతూ.. సబ్ డివిజన్లో ఎలాంటి అవంఛనీయ ఘటనలు జరగకుండా శాంతి భద్రతలను కాపాడుతూ ఆయా కేసులలో ప్రజల సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తూ తగిన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధి రాగి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ బోర్డ్ ఆఫ్ స్టడీగా డాక్టర్ సిహెచ్ లక్ష్మణ చక్రవర్తికి నియామక ఉత్తర్వులు



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యయనశాఖ చైర్మన్ బోర్డ్ ఆఫ్ స్టడీగా డాక్టర్ సిహెచ్.లక్ష్మణ చక్రవర్తికి నియామకపు ఉత్తర్వులు తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ బుర్ర వెంకటేశం ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరి గురువారం అందజేశారు. డాక్టర్ సిహెచ్ లక్ష్మణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను ఇచ్చినందుకు తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ బుర్ర వెంకటేశం, తెలంగాణ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరికి ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ సిహెచ్ లక్ష్మణ్ చక్రవర్తిని అధ్యాపకులు, అధ్యాపకేతరులు అభినందించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే విద్యకు ప్రాధాన్యత

- ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం..
- బిజెపి నల్లచట్టాలతో రైతుల మృత్యువాత
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి/ధర్పల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని, గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేసి 12 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. గురువారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో రూ.ఐదు కోట్ల 63 లక్షల రూపాయలతో చేపట్టే నూతన పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ గత పదేండ్లు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని, అందులో భాగంగా నేడు 5 కోట్ల 63 లక్షల నిధులతో శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని వివరించారు. 6 గ్యారంటీలలో భాగంగా ఇప్పటికే రెండు గ్యారెంటీలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని, వచ్చే వారం నుంచి 500లకు గ్యాస్, 200యూనిట్ల వరకు కరెంట్ అందజేస్తామని ఇప్పటికే ప్రకటించారని ఆయన తెలిపారు. అంతకుముందు బాలికల పాఠశాల విద్యార్థినిలు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి ఘన స్వాగతం పలుకుతూ పాఠశాల తరఫున ప్రిన్సిపాల్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే భూపతిరెడ్డిని శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, ధర్పల్లి మాజీ ఎంపీపీ, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇమ్మడి గోపి ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మోత్కూరి నవీన్‌గౌడ్, కిసాన్‌ఖేత్ మండల అధ్యక్షులు సంతోష్ రెడ్డి, మాజీ ఎంపిటిసి చింతల కిషన్, ఎంపిటిసిలు చింతల దాస్, సుధాకర్, విడిసి అధ్యక్షులు గోవర్ధన్, డెలిగేట్ సుధాకర్, కర్ప మోహన్, డిసిసిబి డైరెక్టర్ కోరట్ పల్లి అనంద్, బైరయ్య, జంగిలి లక్ష్మి, మోహ్సిన్, సద్దం, ఆశిష్, ఎల్‌ఐసి గంగాధర్, మాజీ సర్పంచ్ రాములు నాయక్, తహసిల్దార్ వెంకటరావు, గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు



డిచ్‌పల్లి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

గిరిపుత్రులను ఆదుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..

ధర్పల్లి : గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి వారిని ఆదుకున్నది కేవలం కాంగ్రెస్ పార్టీయేనని రూరల్ ఎమ్మెల్యే డా.రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. గురువారం గిరిపుత్రుల ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో బంజారా నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరము మండల బంజారా సంఘంలో మాట్లాడుతూ.. దేశంలో అట్టడుగు స్థాయిలో ఉంటూ అడవుల్లో నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉంటున్న పేదలకు బంజరాల్లో కలుపుతూ వారికి రిజర్వేషన్ కల్పించి, వారి జీవితాలు బాగుచేసేందుకు, భూములు అందించి, వాటకి బోరు మోటార్లు అందించి వ్యవసాయం దిశగా మళ్లించి సమాజంలో గౌరవప్రదమైన జీవన సాగించే దిశగా చేసింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. ఏమి చేయని బీజేపీ కులాల మధ్య వైషమ్యాలు పెంచుతూ రాముని పేరుతో దేశ ప్రజలమధ్య గొడవలు సృష్టిస్తూ పబ్బం గడుపుతుందని విమర్శించారు. దేవుని పేరు చెప్పుతూ, గుడుల పేరుతో ఓట్లు అడిగేందుకు మళ్లీ బీజేపీ నాయకులు వస్తారని తమ ప్రాంతంలో బీజేపీ అభివృద్ధి చేసిందేముందని చూపించమని ప్రజలు ప్రశ్నించాలని అన్నారు. మన నియోజకవర్గంలో వందల తండాలున్నాయని గడిచిన నాలుగు సంవత్సరాల్లో ఏతండాకు ఏమాభివృద్ధి చేశారో అడిగి నిలదీయాలని ఎంపీ అరవింద్‌ను ఉద్దేశించి అన్నారు. కార్యక్రమంలో ముప్ప గంగారెడ్డి, శేఖర్ గౌడ్, లింగాపూర్ సంతోష్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మిట్టపల్లి గంగారెడ్డి, పుప్పాల సుభాష్, రాకేష్, జెసిబి శ్రీనివాస్, బంజారా మండల నాయకుడు లాల్‌సింగ్, తార చంద్, మోతీరాం, మంగిత్యా, బాలు, సక్రియ నాయక్, లక్ష్మణ్ నాయక్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని బస్సాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ఉప సర్పంచ్ శ్రీధర్, పోతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త భీమ్‌రావు, మాజీ సర్పంచ్ ఇర్వంత్, విండో డైరెక్టర్ డైరెక్టర్ గంగారం తదితరులు నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జూపల్లి కృష్ణారావు సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కోటగిరి ఉమ్మడి మండలంలో ఎంపీపీ భర్త వల్లేపల్లి శ్రీనివాస్ రావు , పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరనున్నట్టు కాంగ్రెస్ మండల అధ్యక్షులు షాహిద్ తెలిపారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

- బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-రెంజల్

ప్రభుత్వ పాఠశాలల ఆధునీకీకరణ కోసం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించిందని, మౌలిక సదుపాయాలతో పాటు ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టనున్నట్లు బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మండలంలోని కూనేపల్లి గ్రామానికి విచ్చేసిన ఆయనకు ప్రజలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపి డబ్బులు వృథా చేసుకోవద్దని, ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించాలన్నారు. గ్రామంలోని కుల సంఘాల వారిగా ఆయనకు ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ భర్త రోడ్డ లింగంతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, మాజీ జెడ్పిటిసి నాగభూషణం రెడ్డి, స్థానిక నాయకులు నీరేడి సాయిలు, శ్రీనివాస్‌గౌడ్, లింగం, మల్లేష్, దేవదాస్, కాంగ్రెస్ యువజన మండల అధ్యక్షులు కార్తిక యాదవ్, సిద్ధ సాయిలు, లోక కృష్ణ, మాజీ సర్పంచ్ జంగం గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ స్టాఫ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి



మంత్రి దామోదర రాజనర్సింహతో వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పట్టణ ఆస్పత్రికి నర్సింగ్ స్టాఫ్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్టు కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు పొద్దుటూరి వినయ్‌రెడ్డి గురువారం తెలిపారు. ప్రజల అవసరాల నిమిత్తం ప్రజారోగ్యం బాగుపడాలన్న సదుద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి స్థానిక ఆసుపత్రి పరిస్థితులు, సిబ్బంది కొరత, స్థానిక సమస్యలపై నివేదిక ఇవ్వడంతో సత్వరమే స్పందించిన ఆరోగ్య శాఖ మంత్రి 26 మంది నర్సింగ్ స్టాఫ్‌ను నియమిస్తూ సంబంధిత శాఖా ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. వైద్యుల కొరతపై త్వరలోనే నియామకాలను చేపడతామని, ఆసుపత్రిలో ఉన్న ఎక్విప్‌మెంట్స్‌పై ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరించి పూర్తిస్థాయిలో 100 పడకల ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులో తీసుకొస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

నేడు ఇందూరు తిరుమల క్షేత్రంలో విశేష 'ఔషదం' పంపిణీ

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో గల ఇందూరు తిరుమల క్షేత్రంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని సంతానం లేని దంపతులకు శుక్రవారం ఔషధాన్ని పంపిణీ చేయనున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు గురువారం తెలిపారు. ఔషధం తీసుకునేవారు ముందుగా వచ్చి ఆలయ ప్రాంగణంలో టోకెన్లు తీసుకోవాలని సూచించారు. ఔషధం కోసం వచ్చే జంటలు మాత్రమే గుడిలోనికి అనుమతిస్తారని పేర్కొన్నారు. ఈ ఔషధ పంపిణీ కేవలం సంవత్సరానికి ఒక్కరోజు మాత్రమే పంపిణీ చేయబడుతుందని సూచించారు. భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఐటీ శాఖ మంత్రికి సన్మానం



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఐటి శాఖ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్‌ను సన్మానించినట్టు సర్పంచుల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు గోర్త రాజేందర్ తెలిపారు. ఇటీవల తిరుపతికి వెళ్లి వచ్చిన రాజేందర్ గురువారం ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌కు తిరుపతి ప్రసాదం అందజేస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట మాజీ ప్రభుత్వ విప్ అనిల్ తదితరులున్నారు.

శ్రీ లక్ష్మీనరసింహా స్వామి బ్రహ్మోత్సవాలు

- గరుడ హోమం, ధ్వజారోహణం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహా స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఉదయం సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, సర్వదేవతా పూజా, గరుడ పటాదివాసము, గరుడ హోమం, ధ్వజరోహణం, బలిహారణం మొదలగు కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ ప్రశాంత్ తెలిపారు. ఈ నెల 23న ఉదయం 10.30కు గిరి ప్రదక్షిణం, స్వామివారి కళ్యాణం మ.12.00గం.లకు నిర్వహించబడుతుందని ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు.

లక్‌పతి దీదిపై వీవోఏలకు శిక్షణ

నవతెలంగాణ-బాల్కొండ

మండలంలోని బాల్కొండ, ముప్కాల్, మెండోరా మూడు మండలాలకు సంబంధించి బాల్కొండ మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో లక్‌పతి దీదీ అంశంపై వీవోఏలకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మహిళా సాధికారతే ప్రధాన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లక్ పతి దీదీ అంశంపై ఒక మహిళకు లక్ష రూపాయల ఆదాయం సమకూర్చడానికి, వారికి సంబంధించిన జీవనోపాధులను గుర్తించి వారికి ఆర్థికంగా బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలను సమకూర్చి వారికి సంవత్సరంలో నెలకు పదివేల చొప్పున సంవత్సరం మొత్తంలో లక్షరూపాయల ఆదాయం వచ్చేటట్టు చేయనున్నట్టు ఏపిడి రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో డిపిఎం మారుతి, ఏపిఎం ప్రసాదరావు, రవికుమార్, విక్రమ్‌రెడ్డి, సిసిలు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మోడీని తొలగించి.. రైతులను కాపాడాలి

- పలుచోట్ల కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఆర్మూర్ : ఢిల్లీ రైతాంగ న్యాయమైన ఆందోళనపై మోడీ ప్రభుత్వం, హర్యానా ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో యువరైతు శుభకరన్‌సింగ్ అమరత్వం పొందిన వారికి జోహార్లు అర్పిస్తూ.. మోడీని తొలగించి రైతుని కాపాడాలని నినాదంతో ఉద్యమాన్ని ఉధృతం చేయాలని గురువారం అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో మోడీ ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవారం మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 సంవత్సరాల కాలంలో రైతు వ్యతిరేక కార్పొరేటు వ్యాపార వర్గాలకు ఊడిగం చేసే విధానాలను చేపట్టడం మూలంగా లక్షలాది మంది రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఆ పరంపర ఇంకా కొనసాగుతూనే ఉందని ఎన్నికల వాగ్దానాల్లో రైతుకు రెండింతలు ఆదాయం తెచ్చిపెడతానన్న మోడీ హామీ నీళ్ల మూట అయిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కిషన్, ఏఐపీకేఎస్ నాయకులు ఆకుల గంగారం, టి.గంగాధర్, ఇస్తారి రమేష్, సిపిఎం ప్రజాపంథా కిషన్, ప్రజాసంఘాల నాయకులు నరేందర్, అశోక్, నిఖిల్, మహేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ఎడపల్లి : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న

ఎడపల్లి : రైతులకు మద్దతు ధర కల్పించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్, ఎడపల్లి మండల అధ్యక్షులు శ్రీపతి మల్లేష్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు కాశ రవి, మండల నాయకులు హనుమాన్లు, సుదర్శన్, కొండ్ర లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో గౌరవం లేదు.. అందుకే కాంగ్రెస్‌లో చేరుతున్నాం

- పలువురు కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

బీఆర్ఎస్‌లో తమ వంతుగా కృషి చేసినప్పటికీ ఆ పార్టీలో తమకు సముచిత గౌరవం ఇవ్వకపోవడంతోనే కాంగ్రెస్‌లో చేరినట్లు ఎడపల్లి మండలం తానాకలాన్ తాజా మాజీ సర్పంచ్ పాల్దా భాస్కర్‌రెడ్డి, కుర్నాపల్లి తాజా మాజీ ఉపసర్పంచ్ నిమ్మపల్లి మహేష్‌గౌడ్ అన్నారు. గురువారం బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు, జిల్లా నాయకులు బిల్లా రామ్మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బోధన్ ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి నాయకులను స్వాగతించారు. రానున్న పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, సాయిలు, అధ్యక్షులు రాజాగౌడ్, సంజయ్, ఆలకుంట రాములు, రమేష్, శ్రీనివాస్‌గౌడ్, మైనార్టీ యూత్ అధ్యక్షులు ఎజాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా టోర్నీకి జట్ల ఎంపిక



సెపక్ తక్రా టోర్నీకి ఎంపికైన జట్లు

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలోని ప్రెసిడెన్సీ పాఠశాలలో సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్, జూనియర్ బాల, బాలికల జట్లను గురువారం ఎంపిక చేసినట్టు సెపక్ తక్రా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదరి సంజీవరెడ్డి గురువారం తెలిపారు. ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 46 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి జిల్లా జట్టును ఖరారు చేసినట్టు వివరించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 24, 25 తేదీలలో నల్గొండలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెన్సీ పాఠశాల ప్రిన్సిపాల్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టును విజయపథంలో నడపాలని, అలాగే టోర్నమెంట్‌లో క్రీడాస్ఫూర్తితో పాల్గొని విజయంతో తిరిగి రావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు జూనియర్ బాలుర విభాగంలో ఉదయ్ కుమార్, హనోక్, రాహుల్, జైల్ సింగ్, నెహ్రు, బాలిక విభాగంలో రిక్కిరెడ్డి, శ్రీజ, శ్రేష్ట, లాస్య ప్రియ, అక్షర, లాస్య శ్రీ రిషిత, సబ్ జూనియర్ బాలుర విభాగంలో భవిక్, ప్రణయ్, వంశీ, మిథున్ తేజ, సాత్విక్, అర్జున్, బాలికల విభాగంలో వర్షిని, యోగేశ్వరి, మన్విత, మన్వి, భవ్య శ్రీ రెడ్డి ఎంపికయ్యారు. జట్ల కోచ్, మేనేజర్లుగా గాదరి సంజీవరెడ్డి, ఎల్.శ్రీనివాస్, సరళ, కళ్యాణ్ వ్యవరిస్తారు. ఈ కార్యక్రమంలో సెపక్ తక్రా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు దీపిక, కార్యనిర్వహణ కార్యదర్శి చామకూర బాగారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, లక్ష్మణ్, సరళ, సంఘ బాధ్యులు సయ్యద్‌నబీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహను రాష్ట్ర సచివాలయం వారి చాంబర్లో టీఎన్జీవోస్ పక్షాన మర్యాదపూర్వకంగా గురువారం కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంప్లాయ్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు అలుక కిషన్, టిఎన్జిఓ కేంద్ర బాధ్యులు మచ్చూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-నవీపేట్

పోలీస్‌స్టేషన్ పరిధిలోని యంచ గోదావరిలో దూకి యువకుడు నవీన్ రెడ్డి (34) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోటగల్లికి చెందిన నవీన్‌రెడ్డి 19వ తేదీన ఇంటి నుంచి వెళ్లాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేశారు. కాక సమాచారం మేరకు గోదావరిలోని మృతదేహాన్ని పరిశీలించగా నవీన్‌రెడ్డిగా గుర్తించారు. మృతుడు లివర్ వ్యాధితో బాధపడుతున్నట్లు మృతుడి భార్య వసుంధర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాటర్ ట్యాంక్ ఏర్పాటు

నవతెలంగాణ-ఆర్మూర్

లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోహన్‌దాస్, హేమలత దంపతులు ఒడ్డెర కాలనీ ప్రైమరీ స్కూల్‌లో సింటెక్స్ వాటర్ ట్యాంక్‌ను గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు మోహన్‌దాస్ మాట్లాడుతూ.. పాఠశాలలో గతంలో నిర్మించిన వాటర్ ట్యాంక్ లీకేజీ వలన విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ పటేల్ తెలియజేసిన సందర్భంగా పాఠశాలకు వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. తమ పాఠశాలలో వాటర్ ట్యాంక్ లీకేజీ గురించి తెలియజేయగా వెంటనే సుమారు రూ.11000 వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్న క్లబ్ అధ్యక్షులు మోహన్‌దాస్, హేమలత దంపతులకు, లయన్స్ క్లబ్ సభ్యులను అభినందిస్తూ ధన్యవాదాములు తెలిపారు. హేమలత పాఠశాల విద్యార్థులకు బిస్కెట్స్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి రఫీ, సభ్యులు శివరాజ్, రూపాలి నర్సయ్య, రాజన్న, జ్ఞాని చావ్ల, కొంగి మనోహర్, శ్రీధర్, హేమలత, ఉపాధ్యాయులు భాగ్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవం



కళ్యాణం నిర్వహిస్తున్న పండితులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జాతర ఉత్సవాలు ఈనెల 19న ప్రారంభం కాగా.. గురువారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు నిజామాబాద్ జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో వేణు దేవాదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ భద్రత సిబ్బందిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జానకంపేట పిఎసిఎస్ అధ్యక్షులు మిద్దె నరేందర్, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, రాచర్ల శేఖర్ రాజ్, జానకంపేట గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో అన్నప్రాసన

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని ఏర్గట్ల, తొర్తి, గుమ్మిర్యాల్, దోంచంద అంగన్వాడీ పాఠశాలల్లో 'పోషణ్ అభియాన్'లో భాగంగా పిల్లలకు అన్నప్రసాన కార్యక్రమాన్ని అంగన్వాడీ టీచర్లు గురువారం నిర్వహించారు. మొదటి ఆరు నెలలు బిడ్డకు తల్లిపాల ప్రాముఖ్యతను తెలిపారు. ఆపై ఆరు నెలల తర్వాత పిల్లలకు ఏ విధమైన ఆహారం అందించాలో తెలుపుతూ.. తల్లులకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సామాజిక, సేవా కార్యక్రమాల్లో 'ఎస్‌బీఐ'

- జనరల్ మేనేజర్ నెట్‌వర్క్-1 మంజు శర్మ
- ప్రభుత్వ పాఠశాలకు ఆర్ఓ వాటర్ ప్లాంట్ అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మహిళా సాధికారత, వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎస్‌బీఐ ఎంతో చురుకుగా పనిచేస్తుందని జనరల్ మేనేజర్ నెట్‌వర్క్-1 మంజు శర్మ తెలిపారు. నిజామాబాద్ నగరంలోని సారంగాపూర్‌లో ఆర్ఏసిసి కొత్త ప్రాంగణాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ నెట్‌వర్క్-1 మంజు శర్మ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (బీఅండ్ఓ), సూర్యకాంత దాష్, రీజనల్ మేనేజర్ ఎం శ్రీకాంత్ పాల్గొన్నారు. అనంతరం నగరంలోని పిఎల్ఎంఎస్ పెట్రోల్ బంక్ దగ్గర గల ఎస్బిఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం) ఆర్ఓ కార్యాలయంలో సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్) కార్యక్రమంలో భాగంగా మహిళలకు కుట్టు మిషన్లను, వృద్ధులకు చక్రాల కుర్చీలను విరాళంగా అందజేశారు. అందులో భాగంగానే నగరంలోని దారుగల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు జనరల్ మేనేజర్ మంజు శర్మ ఆర్ఓ వాటర్ ప్యూరిఫైయర్ సిస్టమ్‌ను అందజేశారు.



కుట్టు మిషన్లు అందజేత

ఘనంగా సొసైటీ చైర్మన్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-బోధన్

సాలుర మండలం హూన్స సొసైటీ చైర్మన్ మందర్న రవి జన్మదిన సందర్భంగా గురువారం హూన్స సొసైటీలో కాంగ్రెస్ నాయకులు ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం ఆయనకు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాలూర కాంగ్రెస్ నాయకులు సరిడే సాయిలు, ఖాజాపూర్ అశోక్, సోక్కం రవి, అల్లె రమేష్, సురేష్ పటేల్, రాహుల్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


సొసైటీ చైర్మెన్‌కు కేక్ తినిపిస్తున్న పలువురు

మున్సిపల్ కమిషనర్‌గా రామకృష్ణ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-భీంగల్

భీంగల్ మున్సిపల్ కమిషనర్‌గా రామకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు పనిచేసిన మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ బదిలీపై వెళ్లగా అప్పటి నుంచి ఇంచార్జ్ కమిషనర్‌గా రాజేందర్ విధులు నిర్వహించారు. ఇటీవల నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో వరంగల్ మెప్మా అధికారి రామకృష్ణను భీంగల్ మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు.


బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్

పాల ఉత్పత్తి పెంచి ఉపాధి పొందాలి

- పీడీ డీఆర్డీఏ సాయగౌడ్

నవతెలంగాణ-మాక్లూర్

పాల ఉత్పత్తులను పెంచి స్వయం ఉపాధి పొందాలని పీడీ డీఆర్డీఏ సాయగౌడ్ సూచించారు. గురువారం మండలంలోని అమ్రాద్ గ్రామంలో పాడి రైతులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో పాడి పరిశ్రమపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయన పాల్గొని మాట్లాడారు. పాడిపరిశ్రమకు ప్రస్తుతం కాలంలో మంచి డిమాండ్ ఉందని, పాలు ఉత్పత్తి చాలా తక్కువగా ఉన్నాయని, సరైన మోతాదులో పాలు దొరకక ప్యాకెట్ పాలు ప్రజలు వినియోగిస్తున్నారని తెలిపారు. కాబట్టి ఈ శిక్షణా ద్వారా మంచి మెళుకువలు నేర్చుకొని అందరూ పాడి పరిశ్రమ ప్రారంభించి పాల ఉత్పత్తిని పెంచాలని, దీని ద్వారా స్వయంగా ఉపాధి పొందాలని సూచించారు. అనంతరం పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జగన్నాథ్ చారి మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో పశువుల పెంపకం చాలా తగ్గిందని, పాలు దొరకడం కూడా చాలా కష్టంగా మారిందని, దీనికి కారణం పాల ఉత్పత్తిపైన అవగాహన లేకపోవడం, పాల ప్రాముఖ్యత పాలలో దొరికే పోషకాలు గురించి సరైన అవగాహన లేకపోవడమేనన్నారు. పశుసంవర్ధక శాఖ ద్వారా గ్రామాలలో అవగాహన కల్పిస్తున్నామని అయినప్పటికీ ఇంకా చాలా వరకు అనుకున్నంత ఫలితాలు రావడం లేదని తెలిపారు. రైతులు ఈ అవగాహనా సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ క్రాంతి, పశువైద్యులు కిరణ్ దేశ్ పాండే, ఉమ్మమ సహెర్ బేగం, ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ వినయ్, సుంకం శ్రీనివాస్, సిపిఎం రాచయ్య, ఒంపాల్, గ్రామ కార్యదర్శి రాధిక, సిబ్బంది రామకృష్ణ, కోఆర్డినేటర్ నవీన్, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారిణి

సొసైటీ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని హూన్స సొసైటీ గోదాంకు ప్రహరీ గోడ నిర్మాణానికి సొసైటీ చైర్మన్ మందర్న రవి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ ఎంపీ నిధుల నుంచి మంజూరు చేసిన 5 లక్షల రూపాయల నిధులతో గోదాం వద్ద ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎంపీ ధర్మపురి అరవింద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కులకర్ణి వినోద్ బాబా, సొసైటీ డైరెక్టర్లు ఖాజాపూర్ అశోక్, మార్కల్ శివ కుమార్, సంజీవ్ పటేల్, సిద్దార్థ్, దేశిపేట్ రాములు, మాదన్న, పల్లెగంగారం బీజేపీ నాయకులు అశోక్‌గౌడ్, సాయినాథ్, సొసైటీ సీఈఓ ముద్ద హన్మంత్‌రావు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న సొసైటీ చైర్మెన్

పత్రికలపై దాడి ప్రజాస్వామ్యానికి ముప్పు

నవతెలంగాణ-బోధన్

వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తున్నా పత్రికలు, ఛానల్స్‌పై వైఎస్సార్‌సీపీ నాయకులు దాడి చేయటం దీనితోపాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పత్రికలపై అసత్యాలను ప్రచారం చేయడం ప్రజా స్వామ్యనికి ముప్పు అని భావప్రకటన స్వేచ్ఛను హరించడటమేనని తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది సిహెచ్.వి హన్మంతరావు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల వైస్సార్ సీపీ మూకలు అనంతపురం జిల్లా రాప్తాడులో ఓ పత్రిక విలేఖరిపై దాడి చేసి విచక్షణ రహితంగా దాడి చేశారని, కర్నూల్‌లో ఓ పత్రిక కార్యాలయంపై దాడిచేసి ఫర్నీచర్‌ను ధ్వంసం చేయటాన్ని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. దాడులకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాంతిభద్రతల పట్ల కేంద్రప్రభుత్వం ప్రదర్శిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రాథమిక హక్కుల పరిరక్షణ పత్రిక స్వాతంత్ర్యాన్ని కాపాడాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన కోరారు.

వైద్యులకొరతపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్
- కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సందర్శన

నవతెలంగాణ-బాల్కొండ

ప్రభుత్వాస్పత్రిలో వైద్యులకొరతపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి వైద్యులతో మాట్లాడి.. ఆసుపత్రిలో ఉన్న వైద్య సిబ్బంది, వైద్య సదుపాయాలు, మెరుగైన వైద్య సేవలు అందించడంలో లోటుపాట్లు, వైద్యుల సమయ పాలన, వైద్యులకు కావాల్సిన సౌకర్యాలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటేషన్‌పై వారంలో రెండు రోజులు మాత్రమే ఇద్దరు డాక్టర్లు వస్తున్నారని, ప్రస్తుతం ఇద్దరు డాక్టర్లు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ రక్షిత మాత్రమే ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నారని తెలుసుకొని, ఆస్పత్రిలో వైద్యుల కొరతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఉన్నతాధికారులను సంప్రదించి సమస్యలను పరిష్కరించే విధంగా అలాగే రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తానని ముత్యాల సునీల్ కుమార్ తెలిపారు. నూతనంగా వచ్చిన స్టాఫ్ నర్సులను అభినందించి రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ బాల్కొండ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సయ్యద్ యూనుస్ తదితరులు పాల్గొన్నారు.


వైద్యులతో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

రైతులపై హర్యానా పోలీసుల హంతక దాడిని ఖండిస్తున్నాం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హర్యానా, పంజాబ్ సరిహద్దుల్లో హర్యానాకు చెందిన పోలీసుల కాల్పులలో పంజాబ్ రాష్ట్రానికి చెందిన శుభకరన్‌సింగ్ మరణించాడని, ఈ దుర్మార్గపు దాడిని ఖండిస్తున్నామని అఖిలభారత రైతు కూలీ సంఘం, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని పూలంగ్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ.. మోడీ రైతు వ్యతిరేక విధానాల వల్ల అనేక మంది రైతులు అసువులు బాస్తున్నారని వారు తెలిపారు. ఈ కాల్పుల ఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతుకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, రైతు కూలి సంఘం నాయకులు దేవస్వామి, నాయకులు శివ కుమార్, గంగాధర్, భారతి, మురళి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు


కిసాన్‌తండా మాజీ సర్పంచ్‌కు కండువా వేస్తున్న సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కిసాన్ తాండ సర్పంచ్ మలావత్ జమున విజయాలు బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కిసాన్ తండా అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉందని, గ్రామ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని ఆయన స్పష్టం చేశారు. తమ గ్రామంలో నవీపేట్ వెళ్లే సాగునీటి కాలువ ద్వారా ఇళ్లల్లో ఊట నీరు వచ్చి ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొనగా ఆ కాలువ సిసి పనులను చేపట్టాలని సంబంధిత అధికారులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. ఈ గ్రామానికి సంబంధించిన వివాదంలో ఉన్న భూములను త్వరలో పరిష్కారం చేస్తానని ఆయన హామీనిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మోతిలాల్, పూల్‌సింగ్, పీర్‌సింగ్, మండల అధ్యక్షులు మొబిన్‌ఖాన్, ధనుంజయ సాయిరెడ్డి, పిడిఓ శంకర్, ఆర్‌డబ్ల్యూసీ గబ్బర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మానవీయతతో కూడిన ఆలోచనలే ఉత్తమ సమాజ నిర్మాణానికి పునాదులు

నవతెలంగాణ-సిరికొండ

మానవీయతతో కూడిన ఆలోచనలే ఉత్తమ సమాజ నిర్మాణానికి పునాదులు అవుతాయని స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి కె.సాల్మన్ తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు రాబర్ట్ బడెన్ పావెల్ 167వ జయంతి సందర్భంగా ప్రపంచ ఆలోచనా దినోత్సవాన్ని సత్యశోధక్ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. మొదటగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య, స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి కె.సాల్మన్ బడెన్ పావెల్.. క్లెయిర్ స్మిత్ దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కె.సాల్మన్ మాట్లాడుతూ.. సైనికాధికారిగా విధులు నిర్వహిస్తూ బడెన్ పావెల్ యుద్ధ సమయంలో గాయపడిన సైనికులకు సేవలందించడానికి పిల్లలను ఉపయోగించుకొని వారిలో సేవాభావం, మానవత్వం, జాతీయత భావాలను చిగురింపచేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో చేసిన కృషి అభినందనీయమన్నారు. చిన్నారులలో చురుకుదనం, ఉత్సాహం, స్నేహశీలత, సహనం పట్టుదలను చూసిన పావెల్ బాలుర బృందాలను స్కౌట్స్ అని బాలికల బృందాలను గైడ్స్ నామకరణతో స్ఫూర్తిని నింపారని తెలిపారు. దేశంకోసం జీవితాలను త్యాగం చేసిన పావెల్, తన భార్య అలేవ్ సెంటర్‌ల స్ఫూర్తితో విద్యార్థులు సమాజసేవలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకావిష్కరణ, సర్వమత ప్రార్థనలు, మొక్కలు నాటారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ వనిత, స్కౌట్ మాస్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్, స్కూల్ ప్రిన్సిపాల్

ఘనంగా కవలల దినోత్సవం


కవలల దినోత్సవంలో పాల్గొన్న 'కవలలు'

నవతెలంగాణ-సిరికొండ

అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని గురువారం సత్యశోధక్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 16 కవల జంటలకు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య మాట్లాడుతూ.. ప్రాణాలు వేరైనా ఒకరిని పోలి ఒకరుండటం, ఒకేలాంటి అభిరుచులు, అలవాట్లు కలిగి ఉండటం విశేషమని అన్నారు. జీవితాంతం ఒకరికొకరు తోడుంటూ మంచి లక్ష్యంతో ఉన్నత స్థాయిలో స్థిరపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి, సతీష్ విద్యార్థులు పాల్గొన్నారు.

అపురూపలో సప్తాహ్నిక పుష్కర బ్రోహ్మోత్సవలు ప్రారంభం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మామిడిపల్లి గ్రామ శివారులో గల అపురూప వెంకటేశ్వర ఆలయంలో సప్తాహ్నిక పుష్కర బ్రహ్మోత్సవాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్‌పర్సన్ అమృతలత మాట్లాడుతూ.. ఈ బ్రహ్మోత్సవాలు వారం రోజుల పాటు కొనసాగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆలయ అర్చకులు సుప్రభాత సేవ, ప్రాత్ఃకాలార్చన, ఉత్సవవరంభ శ్నపనము, మహా నివేదన నీరాజనం, శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణము, సభాప్రార్థన, శ్రీ విష్వక్సేన ఆరాధన, పున్యాహవనము, రక్షాబంధనం, ఋత్విక్ వరణ, మృత్సంగ్రహణ, అంకురార్పణ, వైనతేయ ప్రతిష్ఠ, నివేదన, నీరాజనం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రమణరెడ్డి, ఆలయ అర్చకులు, స్థానికులు పాల్గొన్నారు.



488 ఏండ్ల రాతి కట్టడం

- ఖ్యాతి పొందిన ఏర్గట్ల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం
- ప్రారంభమైన ఉత్సవాలు
- నేడు రథోత్సవం, జాతర

నవతెలంగాణ-ఏర్గట్ల

నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండల కేంద్రంలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఎంతో ఖ్యాతి పొందింది. ప్రస్తుతం దరూరి వంశానికి చెందిన 8వ తరం వంశస్థుల పెద్దలతో వెంకటేశుడు పూజలందుకుంటున్నాడు. ప్రతి సంవత్సరం మాఘ పౌర్ణమికి 5 రోజుల ముందు నుంచి గ్రామకమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు చేపడుతున్నాయి.

ఆలయం నిర్మాణం ఇలా..

క్రీస్తు శకం 1536 సంవత్సరం అనగా.. 488 సంవత్సరాల క్రితం ఈ ఆలయ నిర్మాణం జరిగినట్లు చరిత్ర చెబుతోంది. 488 సంవత్సరాల క్రితం దరూరి వంశానికి చెందిన దరూరి జగన్నాథచారి తన వ్యవసాయ చేను కోసం నుయ్యిని తవ్వుతుండగా అందులోంచి వేంకటేశ్వర స్వామి, లక్ష్మీ ఆళ్వార్ విగ్రహాలు దొరకగా.. వాటికి గ్రామ ప్రజల కోరిక మేరకు రాతితో ఆలయం నిర్మించి, మాఘ పౌర్ణమికి 5 రోజుల ముందు విగ్రహాలు ప్రతిష్ఠించి ఉత్సవాలు జరిపినట్లు తెలుస్తోంది. ఆలయ ప్రధాన ద్వారం వద్ద గరుడ ఆళ్వార్, ఆలయ గర్భగుడికి ముందు ద్వారా పాలకులుగా జయ, విజయ, గర్భ గుడిలో మూల విరాట్‌గా స్వయంభూ శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఉండగా, ఆలయ క్షేత్ర పాలకుడిగా అంజనేయ స్వామి విగ్రహం ఉంది.

దాతల సహకారంతో నూతనంగా ఆలయాభివృద్ధి..

గర్భగుడిలోని వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్ వాస్తవ్యులు ముక్క వినోద్ రూ.18 లక్షలు సహకారం అందించగా, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి మండపానికి దేవాదాయ శాఖ ద్వారా రూ.9లక్షలు, ప్రస్తుత జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్ రూ.లక్షా 15 వేలు, మిట్టపల్లి జగన్మోహన్‌రెడ్డి రూ.లక్షా 16 వేలు, తుపాకుల శ్రీనివాస్‌గౌడ్ రూ.లక్షా 16 వేలు, గడ్డం రమేష్ రూ.55 వేలు, లక్కం నర్సయ్య రూ.32 వేలు సహకారం అందించడంతో ఆలయం మరింత కళను సంతరించుకుంది.



బ్రహ్మోత్సవాలు ఇలా..

ప్రతి సంవత్సరం మాఘ పౌర్ణమికి 5 రోజుల ముందుగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మొదలవుతాయి. ఇందులో మొదటి రోజు అనగా ఈ నెల 19 ఫిబ్రవరి 2024 రోజున పుణ్యహవచనం, అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 21న వెంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించగా.. 23న శుక్రవారం (నేడు) 9.43 నిమిషాలకు స్వామివారి రథోత్సవం, జాతర నిర్వహించనున్నారు. ఈ రథోత్సవానికి మండల ప్రజలే కాకుండా వివిధ దూర ప్రాంతాల నుంచి ప్రజలు హాజరవుతారు. 24న అన్నదానం, 25న నాగవెల్లితో కార్యక్రమాలు ముగుస్తాయి.

8వ తరం వారసులం..

ఆలయం నిర్మాణం జరిగి 488 సంవత్సరాలు అవుతుంది. మా వంశానికి మేము 8వ తరం వారసులం. అప్పటి నుంచి జాతరను నిర్వహిస్తున్నాం. బ్రహ్మోత్సవాలకు 11 రోజుల ముందుగా స్వాముల మాలధారణ ఉంటుంది. 5రోజులు పాటు ఉత్సవాలు జరుగుతాయి. స్వామివారు సంతాన వెంకటేశ్వర స్వామిగా ప్రసిద్ధి చెందారు. ప్రత్యేకాకర్షణగా రాతి స్తంభంతో నిర్మించిన గర్భగుడి, మూల విరాట్, రాతి చక్రాల రథం ఉంటాయి.

- దరూరి రజినీకాంతాచార్యులు, ఆలయ ప్రధానార్చకులు



పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కూనేపల్లి గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలను బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి గురువారం సందర్శించారు. అలుగు ద్వారా వచ్చే నీటి వల్ల పాఠశాలకు ప్రమాదకరంగా మారిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన స్వయంగా ఆ కాలువను పరిశీలించారు. త్వరలోనే సిసి ఏర్పాటు చేయడానికి అధికారులతో మాట్లాడి పనులను పూర్తి చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రభుత్వం నిధులు కేటాయించిందని ఆయన పేర్కొన్నారు.

జాతర ఉత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని దులగుట్ట వద్ద గల 'శ్రీ శివశ్రీనివాస కళ్యాణ మహోత్సవం' ఆలయ జాతర మహోత్సవాలు మూడు రోజుల పాటు కన్నుల పండుగగా నిర్వహిస్తామని స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కనుగుంట లింగం గురువారం తెలిపారు. ఈ నెల 24న శ్రీవారి కల్యాణ మహోత్సవం భక్తుల మధ్య అంగరంగ వైభవంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. శ్రీవారి కల్యాణ మహోత్సవంతో పాటు మల్లన్న జాతర మహోత్సవం సైతం కొనసాగుతుందని అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఇట్టి జాతర ఉత్సవాలను గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 24న అన్నదానం సైతం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కనుగుంట లింగం, సెక్రటరీ గడ్డం పెద్ద గంగారెడ్డి, కోశాధికారి నరేష్ యాదవ్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



మహిళలే మహారాణులు

- జిల్లా ఉపవైద్యాధికారి విద్య



మాట్లాడుతున్న జిల్లా ఉపవైద్యాధికారిణి విద్య

నవతెలంగాణ-కోటగిరి

మహిళలే మహారాణులని జిల్లా ఉపవైద్యాధికారి విద్య అన్నారు. గురువారం కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంపైన అవగాహనా, రీ ఓరియంటేషన్ శిక్షణను ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, ఆశలకు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కానింగ్ సెంటర్స్‌లో లింగ నిర్ధారణ తెలుపవద్దని సూచించారు. గర్భిణుల్లో, చిన్నపిల్లల్లో పోషకాహార లోపం నివారించాలని తెలియజేశారు. మహిళల పట్ల వివక్షత చూపవద్దని, మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సిడిపిఓ జానకి, కోటగిరి వైద్యాధికారి సుప్రియ, ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, ఐసిడిఎస్ సిబ్బంది స్వరూప, రాంబాబు, అంగన్వాడీ సూపర్వైజర్లు సుమలత, మని, వైద్య సిబ్బంది సాయికుమారి, జ్యోతి, ఆరోగ్య సిబ్బంది వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రానికి చెందిన గద్దల సంతోష్ (32) అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందడం, మృతుడిది పేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న ముప్కాల్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు ముస్కు భూమేశ్వర్‌రెడ్డి రూ.5వేలు ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ముస్కు భూమేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్రమ్మదండి లింగం, శ్రీనివాస్ గౌడ్, గద్దల రమేష్ తదితరులు పాల్గొన్నారు.